ప్రజాశక్తి

ఆదివారం 11 ఫిబ్రవరి 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

పెద్ద తండాలో కష్ణా జలాలను విడుదల చేయాలంటూ రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన మహిళలు

కృష్ణాజలాలా సరఫరా పునరుద్ధరణ కోరుతూ

గిరిజన మహిళల రాస్తారోకో

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చీమలపాడు పెద తండాకు కష్ణా జలాల కోసం గిరిజన మహిళలు ఆందోళనకు దిగారు. చీమలపాడు – గంపలగూడెం రహదారి వద్ద శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం మండల నాయకులు పి.ఆనందరావు, నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి, జరపల గోపరాజు మాట్లాడుతూ రెండు మూడు వారాల నుండి ఏ కొండూరు మండలానికి కష్ణాజలాల సరఫరా నిలిచిపోయిందన్నారు. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో దీర్ఘకాలంగా నెలకొన్ని ఉన్న కిడ్నీ వ్యాధి సమస్యపై ఏ కొండూరు మండలంలో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు చేసిన ఫలితంగా ప్రభుత్వం కష్ణా జలాలను సరఫరా చేస్తోందన్నారు. అయితే ప్రస్తుతం ఈ జలాల సరఫరా నిలిచిపోవడంతో గిరిజనులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మోకాళ్ళు, ఒళ్లు, నడుము నొప్పుల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నిలిచిపోయిన కష్ణా జలాలను పునరుద్ధరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అజ్మీర, కోటి, మూడు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన కిడ్నీ రోగులు : సిపిఎం

సంవత్సర కాలంగా ఏ.కొండూరు మండలానికి ట్యాంకర్ల ద్వారా కృష్ణాజలాలను తాగునీటిగా సరఫరా చేస్తున్నారని, అయితే గత కొద్దిరోజులుగా కృష్ణాజలాలు నిలిచిపోవడంతో కాస్తో కూస్తో మెరుగుపడ్డ కిడ్నీవ్యాధుల తీవ్రత మళ్లీ పెరిగే అవకాశం ఉందని సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు పి.ఆనందరావు ఆళ్ల అమ్మిరెడ్డి అన్నారు. బాధితులకు వ్యాధి ముదిరి మళ్లీ మంచం పడుతున్నారని పేర్కొన్నారు. కష్ణా జలాలను వెంటనే సరఫరా చేయాలని కోరుతూ శనివారం చైతన్య నగర్, పెద్దతండాల్లో ఖాళీ బిందెలతో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలోని ప్రజలు తాగుతున్న మంచినీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉందన్నారు. దీంతో (మిగతా 6లో)

'తూర్పు' జనసేనకు?

తెరపైకి మాజీ ఎంఎల్ఎ యలమంచిలి రవి పేరు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

తెలుగుదేశం, జనసేన పొత్తుల్లో భాగంగా విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఈసారి జనసేన పార్టీకి కేటాయించే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఇక్కడ నుంచి రెండు పర్యాయాలు టిడిపి గెలవడంతో మూడోసారి కూడా టిడిపికే కేటాయిస్తారనే అనుకుంటున్న నేపథ్యంలో ఈసారి పొత్తులో జనసేనకు కేటాయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. టిడిపి రెండుసార్లు గెలుపొందిన నేపథ్యంలో ఓటర్లలో సహజంగా వ్యతిరేకత ఉంటుందని, అందువల్ల దీనిని అనుకూలంగా మార్చుకోవాలని ఆ పార్టీ పెద్దలు సమాలోచనలు చేస్తున్నారని తెలిసింది. జనసేన అభ్యర్థి అయితే గెలుపు సులువవుతుందని ఇరు పార్టీ పెద్దలు ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. దీనికితోడు 2019లో ఒంటరిగా పోటీ చేసిన జనసేన అభ్యర్థికి 30వేల పైచిలుకు ఓట్లు రావడంతో ఇక్కడ ఆపార్టీకి బేస్ బాగుందని, ఇది గెలుపునకు పునాది అవుతుందని అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో కాపు ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారని, వీరి ఓట్లు చీలకుండా జాగ్రత్తలు తీసుకుంటే నష్టం వాటిల్లకుండా ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2009 ఎన్నికల్లో హీరో చిరంజీవి ఏర్పాటు చేసిన ప్రజారాజ్యం అభ్యర్థి ఇక్కడ నెగ్గారు. ఇది కూడా కలిసొచ్చే అంశంగా వారు భావిస్తున్నారు. పిఆర్‌పి అప్పట్లో అభ్యర్థిగా బరిలో దిగిన యలమంచిలి రవి బలమైన ప్రత్యర్థులను పక్కకు నెట్టి విజయకేతనం ఎగుర వేశారు. హోరాహోరీగా తలపడిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దేవినేని నెహ్రూ, టిడిపి అభ్యర్థి గద్దె రామ్మోహనరావులపై 190 ఓట్ల మెజారిటీతో యలమంచిలి రవి గెలుపొందారు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో యలమంచిలి రవినే జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దింపాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఆ మేరకు రవితో చర్చలు కూడా ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడ నుంచి టిడిపి గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దిగిన గద్దె రామ్మోహనరావు రెండు పర్యాయాలు ఎంఎల్ఎగా గెలిచారు. 2014లో వైసిపి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణపై 15,503 ఓట్ల మెజారిటీతో, 2019లో వైసిపి అభ్యర్థి బొప్పన భవకుమార్‌పై 15,164 ఓట్ల మెజారిటీతో గెలిచారు. జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన బత్తిన రాముకు 30,137 ఓట్ల వరకు పోలయ్యాయి. అయితే 2019 ఎన్నికల్లో వైసిపి గాలిని ఎదుర్కొని టిడిపి గెలిచిన సీట్లలో విజయవాడ తూర్పు ఒకటి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 స్థానాల్లో విజయవాడ తూర్పుతోపాటు గన్నవరం సీటును టిడిపి సొంతం చేసుకుంది. అంతకష్ట తరమైన పరిస్థితుల్లోనూ టిడిపి జెండా ఎగురవేసింది. ఈ నేపథ్యంలో టిడిపి కాకుండా పొత్తుల్లో జనసేనకు కేటాయిస్తే టిడిపి ఓటు బ్యాంకు జనసేనకు పడుతుందా లేదా అనేది చర్చ నీయాంశంగా మారింది. అంతే జోష్‌గా టిడిపి కార్యకర్తలు, నేతలు జనసేన గెలుపు కోసం పని చేస్తారా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఒక వేళ పొత్తులో జనసేనకు కేటాయిస్తే గద్దె రామ్మోహనరావుకు ఏ స్థానం కేటాయిస్తారనేది ఆసక్తి కరంగా మారింది.

మేరీమాత ఉత్సవాల సందడి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గుణదల మేరీమాత ఉత్సవాలు రెండో రోజు శనివారం కూడా కొనసాగాయి. ఈ వేడుకలను శ్రీకాకుళం కతోలిక పీఠం బిషప్ విజయ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుణదల మేరీ మాత ఉత్సవాలుకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. మేరీ మాత ఆలయం ప్రారంభించి 100 సమత్సరలు అయినా సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ వేడుకలకు తెలుగు రాష్ట్రాలలోని వారే కాకుండా దక్షిణ భారత దేశం నుండి వివిధ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో యాత్రికులు రావడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా బిషప్ గ్రాసి హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై దివ్య పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో విజయవాడ బిషప్

తెలగతోటి రాజారావు, ఫాదర్ ముప్వల ప్రసాద్, ఫాదర్ ఎం.గాబ్రియేల్ పలువురు గురువులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సినీ జగత్తులో అజరామరం ఆ స్వరం

వార్త 6లో

ఐటి రిటర్న్స్ ఆడిట్ ఫీజు పేరుతో డబ్బులు వసూలు

మండల విద్యాశాఖాధికారి నిర్వాకం

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉపాధ్యాయులు ఆదాయపు పన్నుకు సంబంధించిన ధవీకరణ పత్రాలను ఇవ్వడానికి రూ.150 చెల్లించాలని ఇబ్రహీంపట్నం మండల విద్యాశాఖాధికారి చెరుకూరి పుష్పలత హుకుం జారీ చేయడం చర్చనీయాంశమవుతోంది. ఈ హుకుంపై ఉపాధ్యాయుల మధ్య తీవ్ర చర్చ సాగుతోంది. ఆమె "మండల పరిధిలోని ఉపాధ్యాయులందరూ 2023-24 ఆదాయ పన్నుకు సంబంధించిన క్యాలిక్యుకేషన్స్‌షీట్, స్టేట్‌మెంట్ మినహాయింపుల ధృవీకరణ పత్రాలను (త్రీ షీట్స్), రూ.150 (ఐటి రిటర్న్స్ ఆడిటర్ ఫీజు) ది 07-02-2024లోగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తప్పనిసరిగా అందజేయగలరు" అని ఎంఇఒ తన ఫోన్ ద్వారానే ఉపాధ్యాయులందరికీ వాట్సాప్ మెసేజ్‌లను పంపారు. "హెచ్‌ఎంలు పాఠశాలల వారీగా ఉపాధ్యాయులందరి వద్ద నుండి టాక్స్ స్టేట్‌మెంట్ ఫారాలు తీసుకుని ఆఫీసుకు పంపండి' అని ఎంఇఒ - 1 నందిగామ పేరుతో, అలాగే ప్రధానోపాధ్యాయులంతా మీ పాఠశాలకు సంబంధించిన ఇన్‌కమ్‌టాక్స్, రూ.150ను ఆఫీస్ మెసెంటర్ సతీష్‌కు అందజేయాలి" అని మెసేజ్ పంపారు. ఇది ఉపాధ్యాయుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రతి ఏటా ఫిబ్రవరిలో ఉపాధ్యాయులు ఆదాయపు పన్ను పత్రాలు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈనెలలో శాలరీ పేమెంట్ స్టేట్‌మెంట్‌తోపాటు ఐటి పత్రాలు ఇవ్వాలి. వాటిని ఎంఇఒ ట్రెజరీ కార్యాలయానికి పంపుతారు. అయితే 150 రూపాయలు కట్టని వారి పత్రాలను ట్రెజరీ కార్యాలయానికి పంపడంలేదు. ఇబ్రహీంపట్నం మండలానికి పూర్తి ఎంఇఒగా, అలాగే మరో నాలుగు మండలాలకు ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న ఆమె ఐదు మండలాల్లోని ఉపాధ్యాయులు నగదు కట్టాల్సిందేనని అధికారికంగానే వాట్సప్ ద్వారా సమాచారం పంపారు. ఐటి రిటర్న్సుకు సంబంధించి ఆడిట్ అంతా తామే చేయించుకుంటామని, మళ్లీ ఎంఇఒకు ఎందుకు రూ.150 ఇవ్వాలని పలువురు ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. మొత్తం ఐదు మండలాల్లో సుమారు 1400 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ విషయమై ఓ ఉపాధ్యాయ సంఘం నేత...ఎంఇఒను ప్రశ్నించగా, "మీరూ కట్టాల్సిందే, లేకపోతే ఎవరికి చెబుతారో చెప్పుకోండి" అంటూ తెగేసి చెబుతున్నారు. ఎంఇఒ వ్యవహారంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ఉద్యోగ అవకాశాలు

విలేకర్లు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పని చేసేందుకు కింది ప్రాంతాలకు విలేకరులు కావలెను.

విద్యార్హత: ఇంటర్, ఆ పైన..

విలేకరులు కావాల్సిన కేంద్రాలు:

ఎన్‌టిఆర్ జిల్లా
- విజయవాడ నగరంలో నాలుగు ఖాళీలు
- విజయవాడ రూరల్
- జి.కొండూరు

కృష్ణాజిల్లా
- పెనమలూరు
- పామర్రు
- నాగాయలంక
- గూడూరు
- కృత్తివెన్ను
- నందివాడ

ప్రాథమిక అర్హతలు :
- తెలుగులో స్పష్టంగా రాయగల నైపుణ్యం
- జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రాథమిక అవగాహన
- కంప్యూటర్ తెలుగు టైపింగ్
- ఏదైనా తెలుగు పత్రికలో ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత..

ఆసక్తి గల వారు తమ బయోడేటాను కింది నెంబర్లకు వాట్సాప్‌గానీ, vjadesk@gmail.com మెయిల్‌కుగానీ పంపగలరు

:: హాజరుకావాల్సిన చిరునామా ::
ప్రజాశక్తి కార్యాలయం
అరవింద హైస్కూల్ వద్ద, తాడేపల్లి

సంప్రదించాల్సిన నెంబర్లు
9490099206, 9490099530, 9490099218

పెండ్యాలలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామంలో శనివారం 'గడపగడపకు - మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీ, ప్రాంతం చూడకుండా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. నిరుపేదలకు ఆర్థికసాయం అందించటం, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు.

బాలోత్సవాన్ని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - తిరువూరు : స్మార్ట్ ఫోన్లకు, టీవీలకు అతుక్కు పోతున్న ప్రస్తుత తరం పిల్లలు, వాటి నుండి బయటపడి సృజ నాత్మకంగా ఆలోచిం చేందుకు బాలోత్సవంలో భాగంగా నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు దోహద పడతాయని బాలోత్సవ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన బాలోత్సవ సన్నాహక సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. ఫిబ్రవరి 17న తిరువూరు శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న బాలోత్సవంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, సాంబారు వెంకటేశ్వర్లు, బాలోత్సవ కమిటీ సభ్యులు ఎం.హరికష్ణ, రంగారెడ్డి, నాగేశ్వ రరెడ్డి, గుళ్ళపల్లి వెంక టరత్నం, అనసూయ, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జాతీయ జెండావిష్కరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 150 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణను గవర్నర్ చేతుల మీదుగా అతి త్వరలో ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. శనివారం జెండా నిర్మాణ పనులను చైర్ పర్సన్ రాఘవేంద్ర దగ్గరుండి పర్యవేక్షించారు. శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి పథంలో భాగంగా బంగారు పేటలో సుమారు నాలుగు లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, పట్టణ వైసిపి అధ్యక్షులు ఆకుల బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - కంచికచర్ల : డ్వాక్రా మహిళలకు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా లబ్ధి చేకూర్చుతుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల మండలంలో 14,670 మంది డ్వాక్రా మహిళలకు ఆసరా ద్వారా నాలుగో విడత రూ.13.39 కోట్ల చెక్‌ను శనివారం స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ మహిళలు బాగుంటేనే రాష్ట్రం ముందడుగులో ఉంటుందని సిఎం జగన్‌మోహన్ రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. డ్వాక్రా మహిళల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన కంచికచర్ల జగనన్న మహిళా మార్ట్ ఎంతో విజయవంతమైందని ఎపిలోనే నాలుగో స్థానంలో కంచికచర్ల మహిళ మార్ట్ నిలిచిందని ప్రతి డ్వాక్రా మహిళల నుండి రూ.200 రూపాయల పొదుపు చొప్పున రూ.30 లక్షలతో ఏర్పాటుచేసిన మార్ట్ ఇప్పటికే కోటి 50 లక్షల రూపాయల టర్నోవర్‌తో 14 లక్షల రూపాయల ఆదాయంతో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు ఏటిఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయభానును కలిసిన నూతన తహశీల్దార్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండల నూతన తహశీల్దారుగా బదిలీపై వచ్చిన అమ్మాజీ శనివారం రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభానుని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు తెలిపారు.

మైలవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

చనుమోలు వెంకటరావు జయంతి

ప్రజాశక్తి మైలవరం : చనుమోలు వెంకటరావు జయంతిని శనివారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మూడు బొమ్మలు సెంటర్ వద్ద ఉన్న చనమోలు వెంకట్రావు, రాజీవ్ గాంధీ విగ్రహాలకు వైసిపి నాయకులు పూల దండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గానికి చనుమోలు వెంకటరావు చేసిన కషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు శీలం రామకష్ణ, బ్లాక్‌వన్ అధ్యక్షులు దోస్పాటి గిరిధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు, డిసిసి కార్యదర్శి నరసింహ సుధాకర్, అన్నవరపు దుర్గారావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పెర్రీ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చనుమోలు వెంకట్రావు విగ్రహానికి నివాళు లర్పిస్తున్నారు. మైలవరం నియోజకవర్గంతో పాటు రాష్ట్రాభివద్ధిలో మాజీ మంత్రి ఆయన తనదైన ముద్ర వేశారని డీసీసీ అధ్యక్షులు బొర్రా కిరణ్ అన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వా వాసు,చిలుకూరు గ్రామ సర్పంచి గొంది సురేశ్,జిల్లా ఎస్ సి సెల్ అధ్యక్షులు మందా వజ్రయ్య పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం సెంటర్‌లో చనుమోలు విగ్రహానికి పూలమాలలు వేసి ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గాప్రసాద్, వైసిపి నాయకులు నివాళులర్పించారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు. **(ప్ర.వి)**

సరుకులు అందజేస్తున్న దృశ్యం

వికలాంగులకు ప్రవాస భారతీయుల చేయూత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం లోని గుడ్ సమరిటన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులైన కన్నా ప్రవీణ్ సౌమ్య దంపతుల ఆర్థిక సహాయంతో ప్రేమ్ నికేతన్ చిల్డ్రన్స్ హోమ్ లో నివసిస్తున్నటువంటి మానసిక, శారీరక వికలాంగ బాల బాలికలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులైన చిట్టేలు కోటేశ్వరరావు చిట్టేలు హరీష్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరీష్ మాట్లాడుతూ వృత్తి రీత్యా విదేశాలకు వెళ్ళినప్పటికీ, వారు పుట్టి పెరిగిన భారతదేశ ప్రజలకు సేవ చేయాలన్న ప్రవీణ్ - సౌమ్య దంపతుల ఆశను, పలు సేవాకార్యక్రమాల ద్వారా ఆచరణలో పెట్టిచూపించి, తోటి ప్రవాస భారతీయులకు మార్గదర్శకంగా నిలిచారని పేర్కొన్నారు. చిట్టెలు శ్రీనివాసరావు, నాగమణి, చెల్లు క్రాంతి శ్రీ, హర్షిత శ్రీ, కోమటి దుర్గా ప్రసాద్, యర్రంశెట్టి అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వీరులపాడు : భవన నిర్మాణ కార్మికుల కుటుంబానికి శనివారం తోటి కార్మికులు ఆర్థికసాయం అందించారు. ఆదమలి సీనియర్ తాపీ మేస్త్రిగా పనిచేస్తూ పదేళ్ల క్రితం మృతిచెందగా ఆయన భార్య షేక్ రాబి ఇటీవల మృతిచెందారు. భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్న వీరి కుమారులకు భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వైస్ ఎంపిపి షేక్ నాగుల్ మీరా 25 కేజీల బియ్యం, సంఘం నాయకుడు తమ్మిశెట్టి పుల్లయ్య రూ.వెయ్యి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి లాల్ అహ్మద్ గౌస్, భవన నిర్మాణ కార్మికులు కొమ్ము తిరుపతిరావు షేక్ రఫీ షేక్ ఖాదర్ తమ్మిశెట్టి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యపై స్పందించాలి

నిరసనలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆశా వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం 8 వతేది జరిగిన చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకుని అక్రమ అరెస్టులను ఖండిస్తూ శనివారం ఇబ్రహీంపట్నం గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పెరిగిన పనిభారం తగ్గించాలని, అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరని సమస్యలు పరిష్కారం కోసం వెళ్తుంటే ఆశాలను, సిఐటియు నాయకులను అరెస్టులు చేయటం అప్రజాస్వామికమన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ సిఐటియు యూనియన్ ఇబ్రహీంపట్నం పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యంబాబు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శిగా గోసవీడు గ్రామానికి చెందిన నాళ్ళ వెంకట చిన సత్యంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు రాజారావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ విషయమై మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పలువురు హర్షం తెలిపారు.

కాలుష్యంపై ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎటుచూసినా స్వచ్ఛమైన గాలి పీల్చుకునే అవకాశం లేదు అనడానికి ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాలు నిదర్శనంగా ఉన్నాయి. ఎందుకంటే అక్కడ ఉన్న బూడిద కాలుష్యమే పెనుభూతంగా మారింది. ఫలితంగా తినే ఆహారం దగ్గర నుండి పీల్చుకునే గాలి, తాగునీరు సైతం కలుషిత మయమవుతున్నాయి.

బూడిద కాలుష్యంపై మండల ప్రజానీకం ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అనివార్యమైతే ఒకరోజు బంద్‌కు పిలుపునివ్వటానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన ఉద్యమానికి ప్రజలు ప్రత్యక్ష ఉద్యమానికి రూపకల్పన చేస్తున్నారు. డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ విడుదల చేస్తున్న బూడిద కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం ప్రాంతాలలోని కాలుష్యం రెడ్ జోన్‌లో ఉన్నట్లు వాతావరణ సంబంధిత యాప్‌లు ఘోషిస్తున్నాయి. ఇక్కడ పీల్చే గాలి విషతుల్యంగా మారిందని తక్షణమే ప్రాంతం వదిలి పోవాలని సూచిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గాలి కాలుష్యానికి డాక్టర్ ఎన్టీటిటిపిఎస్ నిర్లక్ష్యమే కారణమని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా చెవిటి వాడి చెవిలో శంఖం ఊదినట్లే అన్నతీరు ప్రజలకు మరింత కోపాన్ని తెచ్చిపెడుతుంది. డాక్టర్ ఎన్టీ టిటిపిఎస్ యాజమాన్యం మెడలు వంచడం కోసం ఈ సారి తాడో పేడో తేల్చుకుంటామని స్థానిక ప్రజలు భీష్మించుకున్నారు. కాలుష్య కోరలు చాస్తుంటే కాలుష్య నియంత్రణ మండలి మొద్దు నిద్ర పోతుందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గాలి, నీరు కలుషితం అవుతున్నప్పటికీ పట్టించుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇబ్రహీంపట్నం ప్రాంతం లో బూడిద మాఫియా రెచ్చిపోతున్న నేపథ్యంలో కనీసం చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. ఆయా ప్రాజెక్టులు, కంపెనీలు, విద్యుత్ ప్లాంట్ల నుండి వెలువడే కాలుష్య నియంత్రణ చర్యలు విధిగా తీసుకోవాల్సి ఉంది. అయినప్పటికీ ఆ దిశగా చర్యలు శూన్యమయ్యాయి. అందుకు కారణం కూడా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉదాసీనత కారణమని స్థానిక ప్రజలు బలంగా నమ్ముతున్నారు. వాయు కాలుష్యానికి కారణమైన ఆయా కంపెనీలు, ఫ్యాక్టరీల నుండి బూడిద మాఫియా నుండి పెద్ద వసూళ్లకు పాల్పడుతున్న నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

విశాఖపట్నం చెందిన మాజీ ఐఎఎస్, సైంటిస్ట్ శర్మ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. 'విజయవాడ థర్మల్ పవర్ ప్లాంట్ (ఎన్‌టిటిపిఎస్) నిబంధనలు ఉల్లంఘించింది. వాతావరణంలో విష వాయువులను వెదజల్లుతూ, జల వనరులలో కాలుష్యం వదలడం కారణంగా, చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ఈ విషయాన్ని రెండు నెలల క్రింద ఎపీపిసిబి దృష్టికి తీసుకువచ్చినా, ఆ సంస్థ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరంగా ఉంది. గత డిసెంబర్ మొదటివారంలో, అక్కడి ప్రజలను కలిసినప్పుడు, వారి ఆరోగ్య సమస్యల విషయంలో ఆతృత వ్యక్తంచేస్తూ, ఎన్‌టిటిపిఎస్ వెదజల్లుతున్న కాలుష్యాన్ని ప్రభుత్వం నియంత్రించాలి. ఇది ప్రజల ఆరోగ్యానికి, వారి సంక్షేమానికి సంబంధించిన విషయం అని గుర్తించి చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను' అంటూ లేఖ రాశారు. ఈనెల 15న ఇబ్రహీంపట్నంలోని ముత్తు వరకు కళ్యాణ మండపంలో అఖిలపక్ష కాలుష్య పోరాట సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

విడుదలవుతున్న పొగ (ఇన్‌సెర్ట్‌లో) కమ్ముకున్న పొగ

అనివార్యమైతే ఒక రోజు పట్టణ బంద్

కాలుష్య నియంత్రణ కోసం ప్రజా సంఘాలు మరో సంచలన నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కొండపల్లి మున్సిపాలిటీ మొత్తం ప్రజల సహకారంతో ఒక రోజు సంపూర్ణ బంద్‌కు పిలుపు నిచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక రోజు బంద్‌ను ప్రజలు స్వచ్ఛందంగా అమలు చేస్తే జాతీయ స్థాయిలో సమస్య తీవ్రత తెలుస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వంలో చలనం రావాలనే ఏకైక లక్ష్యంతో ప్రజా ఉద్యమం ఉగ్రరూపం తీసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మొత్తంగా బూడిదపై యుద్ధం రణరంగంగా మారక ముందే ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఉంది. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయడానికి యువత సిద్ధపడుతుంది.

16న బంద్‌ను జయప్రదం చేయండి

కార్మిక సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి-గుడివాడ: రైతు సంఘం సమన్వయ సమితి-కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన జరగబోవు బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చాయి. శనివారం గుడివాడ సిఐటియు కార్యాలయంలో అన్ని కార్మిక సంఘాల నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగిస్తుందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు సి2+50శాతం ప్రకారం మద్ధతు ధరల చట్టం చేయాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించి, 200 రోజులకు పెంచాలని, వేతనం రూ.600లు పెంచి రెండు పూటల పని కల్పించి ఆన్‌లైన్ మస్టర్ రద్దు చేయాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్ట పరచాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేసి కడప ఉక్కును నిర్మించాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకుని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని, భూహక్కుల చట్టం 27/23ను ఉపసంహరించి, చుక్కల భూములు, బంజరు భూములన్నిటికి పట్టాలు ఇవ్వాలని, అనాధీన భూములకు హక్కులు కల్పించాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితులకు పూర్తి పునరావాసం, నష్టపరిహారం ఇవ్వాలని, బంజరు భూములకు కూడా చట్ట ప్రకారం పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని, రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్ర పంటలు భీమా పథకం పెట్టాలని, సాగులో ఉన్న కౌలు రైతులకే నష్ట పరిహారాలు, భీమా సౌకర్యం ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టం సవరణలు ఉపసంహరించాలని, ఆదివాసుల హక్కులను కాపాడాలని, కృష్ణాజలాల పంపిణీలో రాష్ట్ర హక్కులు కాపాడాలని, ఇన్‌పుట్ సబ్సీడీ , పంటల భీమా వెంటనే ఇవ్వాలని పలు డిమాండ్లను తెలపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు, రైతు సంఘం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, వెంకట కృష్ణారావు, రైతు కె పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐగా గరగారావు

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐగా అడపా గరగారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో తూర్పుగోదావరి జిల్లాలో పనిచేసిన గరగారావు బదిలీలలో భాగంగా గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై తప్పని సరిగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం ఆర్టీసి డిస్పెన్సరిలో రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని శనివారం ఆర్టీసి జిల్లా ప్రజా రవాణా అధికారిణి ఎ వాణిశ్రీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా సంస్థ మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, ఉయ్యూరు, గన్నవరం డిపోల నుండి 83 మంది డ్రైవర్లు, కండక్టర్లు సిబ్బంది స్వచ్ఛండంగా రక్తదానం చేశారు. రక్తదాతలను జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ టి.ఎస్.ఎస్ బాలాజీ, సెక్రటరీ భవిరి శంకర్ నాథ్ ట్రెజరర్ కొండపల్లి రాం బాలాజీలు అభినందించారు, అర్ టీ సి డాక్టర్ ఎంఎస్. విజయ్ సింగ్, అర్ టీ సి డిస్పెన్సరీ సిబ్బంది సహకారంతో పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ హనుమంతయ్య, సిబ్బంది రక్త సేకరణ చేశారు.

ఎస్ఐగా అర్జమ్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: మండల కేంద్రమైన బాపులపాడు పోలీస్టేషన్ రెండవ ఎస్సైగా అర్జమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలోల్లో భాగంగా కాకినాడ జిల్లా నుండి బదిలీపై వచ్చిన ఎస్సై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సీఐ నరసింహమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ... పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమన్వయం అందిస్తూ,సమస్యలు పరిష్కరిస్తూ, శాంతి భద్రతలు పరిరక్షించడానికి కషి చేస్తానని అలాగే మండల ప్రజలంతా సహకరించాలని ఆమె కోరారు.బీటెక్(సీఈ) చదివిన ఆమె పోలీసుశాఖ ద్వారా ప్రజాసేవచేయాలనే సంకల్పంతోనే పోలీసుశాఖలో చేరినట్లు అర్జమ్మ తెలిపారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: పేదల కష్టాలు తీరిస్తూ వారి సేవలో తరిస్తున్న రాణా వెల్ఫేర్ సొసైటీ అందరికి ఆదర్శనీయమని ఎస్సీ ఎస్టీ మెంటరింగ్ కమిటీ సభ్యులు పోగొల్ల ప్రకాష్ అన్నారు.బాపులపాడు మండలం కానుమోలు గ్రామానికి చెందిన రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యదర్శి పార్ధసారధి సహకారంతో రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ కలిసి పేదలకు శనివారం దుస్తులను పంపిణీ చేశారు. పేదలకు సేవలందిం చడమే రాణా వెల్ఫేర్ సొసైటీ లక్ష్యమని పర్యావరణ పరిరక్షణ పరిసరాల పరిశుభ్రత లాంటి వాటితో పాటు పేదలకు సేవలందించేందుకు రాణా వెల్ఫేర్ సొసైటీ కషి చేస్తుందని అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పురమ వరప్రసాద్, సుంకర సురేష్ సుంకర బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు: ఉల్లిపాలెం గ్రామంలో వైయస్సార్ విలేజ్ డిజిటల్ లైబ్రరీని అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

శ్మశానానికి రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని వసుమట్ల కాలనీ స్మశానానికి రహదారి ఏర్పాటు చేయాలని కోరుతూ గడచిన కొంతకాలంగా పంచాయతీ పాలకవర్గానికి ఉన్నత అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించిన స్పందన లేనందున జనసేన పార్టీ ఆధ్వర్యంలో రహదారి కోసం ప్రత్యక్ష కార్యచరణకు దిగవలసి ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు హెచ్చరించారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం చనిపోయిన సువర్ణరావు మృతదేహాన్ని శ్మశానానికి తీసుకువెళ్లడానికి ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం స్పందించి రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. ఒకవేళ రహదారి ఏర్పాటు చేయకపోతే గ్రామ ప్రజలను కలుపుకొని నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే మూడుసార్లు ఆ రహదారిని తామే బాగు చేయించామని పంచాయతీ వారికి స్థానిక సమస్యల గురించి కనీస అవగాహన కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, వార్డు సభ్యులు కమిలి సాయి భార్గవ, బొంతు ప్రకాష్, జనాదుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు పంచాయతీ మేనేజర్‌పై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి ఉయ్యూరు: సమాచారహక్కు చట్టం ప్రకారం కోరిన సమాచారం ఇవ్వని ఉయ్యూరు నగరపంచా యతీ మేనేజర్ వి రఘుబాబుపై విచారణకు మున్సిపల్, పట్టణాభివద్ధి శాఖ అదనపు కార్యదర్శి ఎం ప్రతాపరెడ్డి మున్సిపల్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టరు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు సామాజిక కార్యకర్తలు జంపాన శ్రీనివాసగౌడ్, బొల్లా శివ పార్వతి, సమాచారహక్కు చట్టం కార్యకర్త సాకే రాములమ్మ శనివారం ఓప్రకటనలో తెలిపారు. స్థానిక గీతామందిర్ రోడ్డులో నివాసముంటున్న బి పార్వతి తన కుటుంబానికి చెందిన 2019 నవశకం సర్వేలో నమోదైన వారి కుటుంబసభ్యుల వివరాలతో కూ డిసిన సమాచారం ఇప్పించ వలసిందిగా నగరపంచాయతీ మేనేజర్ కు గత అక్టోబర్లో సమచారహక్కు చట్టం ప్రకారం అర్జీ అందజేయగా ఆసర్వే వివరాలు ఇచ్చే అవకాశం లేదని మేనేజర్ బదులిచ్చారు. దీంతో సమచారహక్కుచట్టం ఉద్దేశపూర్వకంగా అమ లుచేయని మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శికి శివ పార్వతి చేసిన ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశిస్తూ తగుచర్యలు తీసుకోవలసిందిగా ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు.



ఆసరా పంపిణీ

ప్రజాశక్తి-పెదపారుపూడి: రాష్ట్రంలో మహిళా అభివృద్ధి ధ్యేయంగా సిఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని పామర్రు శాసనసభ్యులు కైలా అనిల్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన పెదపారుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, గోళ్ల సోమేశ్వరరావు మార్కెట్ యార్డ్ చైర్మన్ తుమ్మల సుధారాణి, వైస్ ఎంపీపీ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-అవనిగడ్డ: టిడివి, జనసేన పార్టీ ఆధ్వర్యంలో అవనిగడ్డలోని ఆరో వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకట్రాం, నియోజకవర్గ పరిశీలకులు పంతాని మురళీధర్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి టిడిపి జనసేనల ఉమ్మడి మినీ మేనిఫెస్టో సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వరరావు, బచ్చు రఘునాథ్, మాచవరం ఆదినారాయణ, మండలి రామ్మోహన్రావు, అడపా శ్రీనివాసరావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే అజెండా : బూరగడ్డ

ప్రజాశక్తి-పెడన: టిడిపి జనసేన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివద్ధి ఎజెండా అని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కమలాపురం, ఉరివి, చెన్నూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వేదవ్యాస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి ఉమ్మడి శాసనసభ అభ్యర్థిగా అధిష్టానం తనను నియమించినట్లు చెప్పారు. పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ,త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. రైతుల కోసం ప్రత్యేక పథకాలు అమలుపరిచేందుకు అధిష్టానం ఆలోచన చేస్తుందన్నారు. ఇంటింటికి ప్రతిరోజు త్రాగునీరు సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించుతామన్నారు. పులిచింతల ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు ఖరీఫ్, రబీ పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు ఊచా వెంకయ్య, కౌన్సిలర్లు మట్ట శివ పావని, గల్లా రామాంజనేయులు, మానికొండ వెంకటేశ్వరరావు, కునపురెడ్డి వెంకటేశ్వరరావు, అడపాల వెంకట శ్రీనివాసరావు, దొండపాటి పెద్దబాబు, బోయిన ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

పిఎస్‌ల తనిఖీ

ప్రజాశక్తి-మోపిదేవి: అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్‌అస్మి శనివారం ఆకస్మికంగా సందర్శించారు . అనంతరం మోపిదేవి శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు ఎస్‌పికి స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు. అవనిగడ్డ డిఎస్పి మురళీధర్, సిఐ త్రినాథ్ మోపిదేవి ఎస్ఐ వీర వెంకట సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'మత్స్యకారులు టిడిపికి మద్దతివ్వాలి'

ప్రజాశక్తి-అవనిగడ్డ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మత్స్యకార సంఘాల నాయకులు టిడిపికి మద్దతు ఇచ్చి గెలిపించాలని రాష్ట్ర టిడిపి నాయకులు అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు పంతాన్ని మురళీధర్‌రావు కోరారు. శనివారం నాగాయలంకలోని మత్స్యకారుల భవనం వద్ద మత్స్యకార సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గుంటూరు జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆప్కాబ్ డైరెక్టర్గా విధులు నిర్వహించానని మత్స్యకారుల సమస్యలు తనకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు, ఎంపిటిసి సభ్యులు లంకె శ్రీనివాస ప్రసాద్, కర్రి కృష్ణమూర్తి, నాగిడి పోతురాజు, సైకం విజయభాస్కర్, అంద్రాజు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్దానం ఇంద్రకీలాద్రి, దుర్గమ్మ దేవస్థానంలో నిర్మాణంలో వున్న శివాలయం అభివృద్ధి పనులను శనివారం పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ వైదిక సిబ్బంది, దాత సంగా నరసింగారావు, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి అభివద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా మల్లేశ్వర స్వామివారి ఆలయ పనులు, యాగశాల పనులు తదితరములు పరిశీలించి ఆలయ అధికారులకు త్వరితగతిన పనులు పూర్తి చేయవలసినదిగా చైర్మన్ ఆదేశించారు.

నేడు ఆరోగ్య సదస్సు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఫర్ స్లీప్ ఆప్నియా (ఐఎఎస్ఎస్ఎ) ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు సూర్యారావుపేటలోని సాగర్ ఈ.ఎన్.టి ఆసుపత్రి ప్రాంగణంలో గురక వ్యాధి వైద్య విధానంపై జాతీయ స్థాయి సదస్సు జరుగుతుందని ప్రముఖ వైద్యులు విద్యాసాగర్ తెలిపారు. నగరంలోని ఆసుపత్రి ఆవరణలో శనివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిద్రించే సమయంలో చాలా మందికి గురక వల్ల వచ్చే సమస్యలు ఎన్నో ఉంటాయన్నారు. ఈవ్యాధికి ఇప్పటివరకు పూర్తిస్థాయి చికిత్స అందుబాటులో లేదన్నారు. ఈ వ్యాధి నివారణపై నిరంతరం జరుగుతున్న పరిశోధనలు, వైద్య విధానాలు అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలు ప్రజలకు తెలియచేసేందుకు ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఈ జాతీయ సదస్సు జరుగుతుందని, 2024 సంవత్సరానికి సంబంధించి విజయవాడలో జరుగుతుందని తెలిపారు. ఈ వ్యాధి చికిత్సలో ఎన్నో పరిశోధనలు చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మోహన్ కామేశ్వరన్, డాక్టర్ దీన్ దయాల్ సహా దేశంలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ వైద్యులు వంద మందికిపైగా పాల్గొంటారని తెలిపారు. వ్యాధి నివారణ కోసం చేసిన పరిశోధనలు వివరిస్తారన్నారు.

'కెనరా' లోన్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్మెంట్ కళాశాల గ్రౌండ్ నందు శనివారం కెనరా బ్యాంక్ మెగా రిటైల్ లోన్ ఎక్స్‌పో ప్రారంభమైంది. బ్యాంక్ జనరల్ మేనేజర్ పి.రవి వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ వాడకు చెందిన ప్రముఖ బిల్డర్స్ అండ్ డెవలపర్, 8 మంది వాహన డీలర్లు పాల్గొన్నారని తెలిపారు. ఈ ఎక్స్ పోలో సర్ఫేస్ వేలం కింద ఉన్న ఆస్తులు కూడా ప్రదర్శించినట్లు తెలిపారు. కెనరా బ్యాంక్ డిజిటల్ ఉత్పత్తులు., ఎంఎస్ఎం ఈ ఉత్పత్తులు కూడా ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా మొత్తం 104 మంజూరు పత్రాలకు సంబంధించి సుమారుగా రు.50 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మేనేజర్ చిరంజీవి, సీనియర్ మేనేజర్ విజయ రామారావు, పలువురు బ్యాంక్ సిబ్బంది, బిల్డర్స్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

ప్రజాశక్తి వత్సవాయి : నియోజక వర్గ అభివృద్ధిలో భాగంగా వత్సవాయి మండలం, భీమవరం గ్రామంలో రూ.4 కోట్లతో బోనకల్లు, భీమవరం, లింగ గూడెం, భీమవరం రోడ్లు, ఎస్సీ, బీసీ కాలనీలలో ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీయం వైయస్ జగన్మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ళ సంక్షేమ పాలనలో భీమవరం గ్రామానికి అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా దాదాపు వంద కోట్ల మేర లబ్ధి చేకూర్చామని తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం తదితర పనులతో గ్రామాన్ని అభివద్ధి పథం వైపు నడిపిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలుసు రమాదేవి, జడ్పిటిసి దేవమని, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వైసిపి నాయకులు చింతకుంట్ల వెంకటరెడ్డి, ప్రజా ప్రతినిధులు గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక నేత దివాకర్ సేవలు స్ఫూర్తిదాయకం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

జోహార్లు అర్పిస్తున్న బాబురావు, సత్యబాబు, ఆదిలక్ష్మి తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సిపిఎం, సిఐటియు కార్మిక నేత పి. దివాకర్ సేవలు స్ఫూర్తి దాయకమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. సిపిఎం రాష్ట్ర మాజీ కమిటీ సభ్యులు, విజయవాడ మాజీ కార్యదర్శి, కార్మిక నేత పి.దివాకర్ 20వ వర్థంతి పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబురావు ముఖ్య అతిథిగా హాజరై దివాకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ అధిక ధరలు నియంత్రించడంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో గిట్టుబాటు ధర కల్పించడంలో మహిళలకు మైనార్టీలకు రక్షణ కల్పించడంలో కేంద్రంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. అభివద్ధిని మరిచి అవినీతి ధ్యేయంతో ప్రజా పోరాటాలను కార్మిక పోరాటాలను అణిచివేస్తున్నారు. కార్పొరేషన్‌లో నీతి నిజాయితీగా సిపిఎం పోరాడుతుందని కొనియాడారు. సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి కార్పొరేటర్ బోయి సత్యబాబు. మాజీ కార్పొరేటర్ జి ఆదిలక్ష్మి, సిపిఎం నగర్ కమిటీ సభ్యులు బి రాజు, ఎం కొండారెడ్డి, సీనియర్ నాయకులు జి సుబ్బారెడ్డి, టి.జోనేష్, ఏ శ్రీను పాల్గొన్నారు. 46వ డివిజన్ మిల్క్ ప్రాజెక్టు ఎదుట గల దివాకర్ భవన్‌లో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పాల్గొని దివాకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నగర కమిటీ సభ్యులు కే. సూరిబాబు, ఈవీ నారాయణ, రాజేష్, గోపిరెడ్డి, దాసు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే చెవి ఇన్ఫెక్షన్ల నివారణ

అంకుర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ టి.వి.విజయ్‌కుమార్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : తీవ్రమైన చెవి ఇన్ఫెక్షన్లను అక్యూట్ ఓటిటిస్ మీడియా అని కూడా పిలుస్తారని, ఇవి సాధారణంగా పిల్లల్లో ఎక్కువగా కనిపించే రుగ్మతలు అని క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం వంటి మంచి పరిశుభ్రతను ప్రోత్సహించడం ద్వారా ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని తగ్గించుకోవచ్చని అంకుర హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.వి.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెవి మధ్యలో మంట, ఇన్ఫెక్షన్ వల్ల సంభవిస్తుంటాయన్నారు. పిసివి, ఇన్ఫ్లు యెంజా వ్యాక్సిన్‌లతో సహా టీకాలు, చెవి ఇన్ఫెక్షన్‌లకు దారితీసే అంటువ్యాధులను నిరోధించడంలో సహాయపడతాయని తెలిపారు. పాసివ్ స్మోకింగ్ నివారించడం వల్ల చెవి ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని పెంచే హానికరమైన ఏజెంట్లకు గురికావడం తగ్గుతుందన్నారు. పాసిఫైయర్ వాడకాన్ని పరిమితం చేయడం, ముఖ్యంగా నిద్రలో వీటి వినియోగం తగ్గించటం, చెవి ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని, కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వడం వల్ల, తల్లి పాలలోని యాంటీబాడీల వల్ల చెవి ఇన్ఫెక్షన్‌ల ప్రమాదాన్ని తగ్గించొచ్చని పేర్కొన్నారు. తీవ్రమైన బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ సూచిస్తాయని చెప్పారు. వేడి కాపరం వంటివి తాత్కాలిక నొప్పి ఉపశమనాన్ని అందించడంతో పాటు వాపును తగ్గిస్తాయన్నారు. విశ్రాంతి, తగినంతగా ద్రవాహారం రికవరీ సమయంలో రోగనిరోధక వ్యవస్థకు మద్దతునిస్తాయని అన్నారు. తీవ్రమైన చెవి ఇన్ఫెక్షన్లు బాధను కలిగించొచ్చని, సరైన నివారణ చర్యలు, సకాలంలో చికిత్స వాటి ప్రభావాన్ని తగ్గించగలవని తెలిపారు.

శాస్త్రీయ విజ్ఞాన ఆలోచనే ధ్యేయంగా జెవివి సైన్స్ కళాయాత్ర

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : జెవివి ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్ర స్టేట్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్ కార్యక్రమం కొండపల్లిలోని క్రాంతి హైస్కూల్లో శనివారం జరిగింది. 20 మంది కళా బృందంచే నిర్వహించిన ఈ కార్యక్రమంలో చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు చిన్నారులను అలరించాయి. యాత్రకు నాయకత్వం వహించిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆల్ ఇండియా పీపుల్స్ నెట్వర్క్ దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా సైంటిఫిక్ టెంపర్ ప్రచారం కోసం నవంబర్ 7 మేరీ క్యూరీ జయంతి నుంచి ఫిబ్రవరి 28 సైన్స్ డే వరకు సైన్స్ ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కళాయాత్ర చేయాలని ఉద్దేశంతో రాష్ట్రంలో ఫిబ్రవరి 5 నుండి 18 వరకు శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు 2000 కిలోమీటర్లు సైన్స్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో పాటలు డాన్సులు నాటికలు మ్యాజిక్ షో ఉన్నాయని, పాఠశాల కళాశాల మరియు గ్రామస్తులకు సైన్స్ ప్రాధాన్యతను మాటల కంటే కళారూపాల ద్వారా తెలియజేస్తే తొందరగా హత్తు కుంటుందనే ఉద్దేశంతో సైన్స్ కళాయాత్ర చేస్తున్నట్టు తెలియజేశారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి నష్టం కలిగించే పరిస్థితులు కొనసాగుతున్నాయని, అంతేకాకుండా లౌకిక వాదానికి భంగం కలిగేలా వాతావరణం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ మురళీమోహన్ జిల్లా కార్యదర్శి గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు, డాక్టర్ మోహన్ రావు మెమోరియల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ మామిడి శీతారామారావు, జెవివి కొండపల్లి శాఖ అధ్యక్షులు సంపసాల నాగరాజు, కార్యదర్శి సర్దార్ సాహెబ్, కోశాధికారి చేతన్ మురళి, సభ్యులు డేవిడ్ రాజ్, కొండపల్లి మాజీ సర్పంచ్ వెనిగళ్ళ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న దేవాదాయ కమిషనర్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ దంపతులు శనివారం ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. అనంతరం వీరు శ్రీ గంగా దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల పల్లకీ సేవలో పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గొలగాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గొలగాని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొలగాని రవికృష్ణ చెప్పారు. శనివారం రవికృష్ణ మాతమూర్తి స్వర్గీయ గొలగాని లక్ష్మీ దుర్గాంబ ఐదవ వర్ధంతి సందర్భంగా అన్నదాన వారధి ద్వారా గొలగాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ వన్‌టౌన్ దుర్గా ఘాట్ వద్ద, అలంకార థియేటర్ వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీనగర్‌లోని ఎస్‌కేసివి చిల్డ్రన్స్ ట్రస్ట్‌లోని పిల్లలకు, స్టాఫ్‌కు అందరికీ అన్న వితరణ కార్యక్రమం జరిగింది. దుర్గా ఘాట్ వద్ద జరిగిన పూజా కార్యక్రమం తరువాత బ్రాహ్మణ, శ్రీ వైష్ణవ పురోహితులకు వస్త్ర దానం చేశారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతు ఎస్‌కెసివి ట్రస్టు ఇస్తున్న విద్యా అవకాశాన్ని ఉపయోగించుకొని జీవితంలో పైకి ఎదగాలని అక్కడి పిల్లలకు ధైర్యం చెప్పారు. అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షులు లకనం శ్యాం ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో బిజెపి విజయవాడ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, బిజెపి నాయకులు శివకుమార్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు పంపిణీ చేస్తున్న సామినేని

అక్కా చెల్లెమ్మల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం: సామినేని

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అక్కాచెల్లెళ్ల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న పాలన సాగుతుందని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని స్థానిక మార్కెట్ యార్డ్ నందు పట్టణ మెప్మా ఆధ్వర్యంలో వైయస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, ఆయన సతీమణి శ్రీమతి సామినేని విమలభాను, యువ నాయకులు సామినేని వెంకటకష్ణ ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారులను చేయాలనే దిశగా జగనన్న పాలన అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహోత్సవాల్లో పాల్గొన్న కాపా వంశస్థులు

మహోత్సవాల్లో కాపా వంశీయులు

ప్రజాశక్తి - నందిగామ : భద్రచలంలొ నందిగామకు చెందిన కాపా వంశీయుల అద్వర్యంలో శ్రీ అన్నపూర్ణా సమేత శ్రీ రామలింగేశ్వరస్వామీ వారి కళ్యాణం శత జయంతి మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. భద్రాచలానికి చెందిన కాపా కృష్ణ ప్రసాద్, నందిగామ కు చెందిన కాకతీయ అపోలో విద్యా సంస్థలు అదినేత కాపా రవీంద్రనాథ్, డైరెక్టర్ కాపా కార్తికేయ, ప్రముఖ హెూమియో వైద్యులు కాపా భాను ప్రసాద్ కుటుంబ సభ్యులు, ప్రత్యేకంగా కళ్యాణ మహోత్సవాలలో పూజలు నిర్వహించారు.

శంకుస్థాపన చేసిన సామినేని ఉదయభాను

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి వత్సవాయి : భీమవరంలో జాతీయ రహదారి పక్కన రూ. 2.80 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సామినేని ఉదయభాను రాష్ట్ర కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఉదయభాను మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన నిర్మించే ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రతో పాటు ట్రామాకేర్ సెంటర్‌ను కూడా తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై జరిగే యాక్సిడెంటుల్లో బాధితులను ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి కూడా అత్యున్నత స్థాయిలో తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నివాస్ మాట్లాడుతూ ఎపిఐఐసికి ఇచ్చిన భూమిని తిరిగి రెవెన్యూ పరిధిలోకి తీసుకొచ్చిన ఘనత ఉదయభానుకే సాధ్యమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలుసు రమాదేవి, జడ్పిటిసి దేవమని, సొసైటీ అధ్యక్షులు శ్రీ శ్రీనివాసరెడ్డి, గుండం రంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు అదనపు వసూళ్లు..?

ప్రజాశక్తి-పెడన: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా విద్యుత్ శాఖ అధికారుల పనితీరు తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న పేదవాడి సొంతింటి కల కొన్ని శాఖల అధికారులకు లక్షలు కుమ్మరించి పెడుతున్నాయి. పెడన మున్సిపల్ పరిధిలోని పైడమ్మ కాలనీలో 340, పట్టణ శివారు పల్లోటి పబ్లిక్ స్కూల్ వెనుక కాలనీలో 370, మున్సిపాలిటీలో 180, మండల పరిధిలోని 24 పంచాయతీల్లోను 400 పైగా గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారుల రికార్డులే చెబుతున్నాయి. అయితే వీరందరికీ ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ పరికరాలు, మీటర్లు అమర్చుతున్నప్పటికీ సంబంధిత గుత్తేదారులు, అధికారులు లబ్ధిదారుల వద్ద నుంచి ఒక్కొక్క మీటరుకు 800 నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మీటర్ బిగించే గుత్తేదారులు

అడిగినంత ఇవ్వకపోతే 15 నుంచి 25 రోజులు పాటు వారికి మీటర్ బిగించడం లేదని, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం సదరు లబ్ధిదారునికి సర్వీస్ వైరు, దాని సంబంధించిన ఐరన్ కేబుల్ అలాగే మీటరు, మెయిన్, అమర్చిన బోర్డు ప్రభుత్వమే లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తుంది. అయితే ఇంటి సామర్థ్యాన్ని బట్టి ఫీజు అలాగే మూడున్నర అడుగుల అంగుళం ప్లాస్టిక్ పైపులు మాత్రమే వినియోదారుడు కొనుగోలు చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ రెండిటి ధర బయటి మార్కెట్లో 100 నుంచి 120 రూపాయలు మాత్రమే ఉండగా సంబంధిత గుత్తేదారుడు మాత్రం వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. మున్సిపాలిటీ, మండల ప్రాంతంలోనే ఒక విద్యుత్ శాఖ, సంబంధించిన గుత్తేదారుడు ఇప్పటివరకు 1222 విద్యుత్ మీటర్లు బిగించినట్లు తెలిసింది. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ జయరాంను వివరణ కోరగా మీటర్లు బిగించే విధానం గుత్తేదారులకు ఇచ్చామని, ఎవరైనా అధికంగా వసూలు చేస్తున్నారని సదరు లబ్ధిదారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని తెలిపారు.

టిడిపి కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి: టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని చల్లపల్లి దళితవాడ 63వ బూత్ పరిధిలో శనివారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, మోర్ల శివ, పటాన్ జిలాని, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, పట్టణ అధ్యక్షులు షేక్ నబీ, ప్రముఖ న్యాయవాది కొడాలి మురళి తదితరులు పాల్గొన్నారు

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో విచ్చలవిడిగా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవట్లేదని గ్రామస్తులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన మద్యం విక్రయ షాపులు ఉదయం 9 నుండి రాత్రి 9 గంటల వరకు విక్రయాలు జరుగుతుంటే బెల్ట్ షాపుల్లో ఏటీఎం లాగా ఎనీ టైం మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైయస్సార్ బ్రిడ్జ పక్కన నాలుగు బెల్ట్ షాపులు, అలాగే బస్టాండ్ వెనుక దాణా ఫ్యాక్టరి రోడ్లో 3 మద్యం షాపులు, అలాగే అనేక చోట్ల అధిక రేట్లకు మందుబాబులకు మద్య విక్రయిస్తున్నారు. కొంతకాలంగా ఈ విక్రయాలపై ఎక్స్ఛేంజ్ అధికారులు తనిఖీలు లేకపోవడంతో మరింత విచ్చలవిడిగా మారాయని స్థానికులు చెప్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.

నేటి నుంచి లోకేష్ శంఖారావం : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): వైసిపి నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 11వ తేదీ నుంచి శంఖారావం పేరుతో పర్యటించనున్నట్లు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 50 రోజుల్లో మొత్తం 120 నియోజకవర్గాల్లో రోజుకు మూడు నియోజకవర్గాలలో శంఖారావం జరుగుతుందన్నారు. శంఖారావం ద్వారా ఆయా ప్రాంతాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. శంఖారావం కార్యక్రమం ఉత్తరాంధ్ర నుండి మొదలవుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ మోటమర్రి బాబాప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం (బోస్), జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మరకాని పరబ్రహ్మం, అధికార ప్రతినిధి తలారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిన రాష్ట్ర ప్రజలలో భరోసా కల్పించేందుకు టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం పూరిస్తున్నారని గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. యువగళం పాదయాత్రలో మిగిలిపోయిన ప్రాంతాలను కవర్ చేస్తూ నారా లోకేష్ శంఖారావం యాత్ర చేపడుతున్నారని ఆయన చెప్పారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి : ఎస్పి

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పి హస్మి

ప్రజాశక్తి-అవనిగడ్డ: రానున్న సార్వత్రిక ఎన్నికలలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఎన్నికలు శాంతియుతంగా జరిగే విధంగా సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ హస్మి తెలిపారు. అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను డిఎస్పి మురళీధర సీఐ త్రినాథ్ తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలీస్ స్టేషన్ల వారీగా పరిశీలించినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీలకు స్వేచ్ఛగా ప్రచారం చేసుకుని ఎలా సిబ్బంది ఎలాంటి వివక్ష లేకుండా సహకరించాలని ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తనతో నేరుగా సంప్రదించవచ్చునని ఎస్పీ చెప్పారు. ఎన్నికల్లో ఎలాంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎస్సై జి రమేష్ పాల్గొన్నారు.

రవాణా రంగంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి

ఎన్టీఆర్ స్టేడియం వద్ద సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుడివాడ : రవాణా రంగంలో రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి పేర్కొన్నారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వద్ద గల మినీ వ్యాన్ స్టాండ్‌వద్ద డ్రైవర్లతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు క్రిమినల్ చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు చేసిందని ఆ మార్పుల రీత్యా నేడు యాక్సిడెంట్లు జరిగినప్పుడు డ్రైవర్లను ముద్దాయిని చేస్తూ అతనికి రెండు లక్షల రూపాయలు జరిమానా అలాగే పది సంవత్సరాలు జైలు శిక్షలాంటి నిబంధనలు పెట్టారన్నారు. వీటి రీత్యా నేటి దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయి అనేకమంది బతకడం కోసం ఈ ట్రాన్స్పోర్ట్ రంగంలో డ్రైవర్లుగా వాటి కింద క్లీనర్లుగా జీవిస్తున్నారన్నారు. ఇలా చట్టాలు మార్చడం రీత్యా వీళ్ళు రాబోయే రోజుల్లో ఈ ట్రాన్స్పోర్ట్ రంగంలో కార్మికులుగా పనిచేయడానికి కూడా వాళ్ళు సిద్ధమవుతున్నారన్నారు. కాబట్టి వీటన్నిటిని కేంద్ర ప్రభుత్వం ఇలా చట్టాలు మార్చి ట్రాన్స్పోర్ట్ రంగం అంత కార్పొరేట్ శక్తులకి అప్పజెప్పడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. ఈనెల 16న సమ్మె నేపథ్యంలో కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాకి సంతకాల రూపంలో విన్నవించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆర్‌టిసి ఉద్యోగి కొండపల్లి విజయకుమార్, భాష, రంగారావు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఆశాలపై నిర్బంధకాండకు నిరసనగా రాస్తారోకో

పామర్రు: ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపుమేరకు చలో విజయవాడ బయలుదేరిన ఆశా వర్కర్లపై ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ శనవారం పామర్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఆశాల పట్ల కొంతమంది పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని, దుర్భాషలాడటం కూడా జరిగిందని, వీరిపై చర్యలు తీసుకోవాలని, నాయకులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు డి.నాగ సావిత్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న తమ డిమాండ్స్‌ను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఒ.గంగాధర్ ప్రసాద్, శివలీల, కవిత, సత్యవతి, భూలక్ష్మి, ముళ్లపూడి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఆన్ లైన్ ద్వారా బిల్లులు చెల్లించడం పట్ల అవగాహనను పెంచే విధంగా కషి చేస్తున్న విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు అని ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి శ్రీహరి బాబు అన్నారు. మండలంలోని నారయ్య అప్పారావు పేట గ్రామంలో శనివారం డిజిటల్ పేమెంట్స్ పై ఉషా రామా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఇంటికి వెళ్ళి ఫోన్ బిల్, రీచార్జ్, కరెంట్ బిల్లు, నగదు బదిలీ,యుపిఐ పేమెంట్స్ ఎలా చేయాలో వివరించారు. అంతే కాకుండా ఆన్ లైన్ బ్యాంకింగ్ లో పలు రకాల మోసాలు జరుగుతున్నాయని ఆధార్ కార్డు ఎలా లాక్ చేయాలో, ఎలా అన్ లాక్ అనే వివరాలు తెలియజేశారు. ఆన్ లైన్ మోసాలు జరిగిన వెంటనే సంబంధిత బ్యాంకు లోను, సైబర్ క్రైమ్‌లోను ఫిర్యాదు చేయాలని సూచించారు.

పవన్‌ను కలిసిన రాము

ప్రజాశక్తి-గుడివాడ: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను హైదరాబాద్ లోని ఆయన స్వగహంలో శనివారం గుడివాడ టిడిపి ఇన్చార్జ్ వెనిగండ్ల రాము మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కారం చేశారు. ఈ సందర్భంగా గుడివాడ రాజకీయాలపై పవన్ కళ్యాణ్, వెనిగండ్ల రాము చర్చించారు. గుడివాడలో జనసేన నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని తెలిపారు.

జనసేన జెండా దిమ్మెల ఆవిష్కరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో జనసేన పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఏడు జనసేన పార్టీ జెండా దిమ్మెలను శనివారం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ ఆవిష్కరించారు. ఇటీవల 11వ డివిజన్లో జనసేన పార్టీ దిమ్మెను కూల్చివేసిన క్రమంలో ఏడు చోట్ల పార్టీ జెండా దిమ్మెలను నిర్మించి జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలను టౌన్ ప్లానింగ్, పోలీసులు అడ్డుకోవడంతో జనసేన నాయకులు నిరసనకు దిగారు. దీంతో బండి రామకృష్ణతో సహా పలువురు నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోసూరు లక్ష్మీ నాంచారయ్య, వాలిశెట్టిమల్లి, మాదివాడ రాము, బాసావాసు, యర్రంశెట్టినాని, వన్నెరెడ్డి జయరాం, మురళి, కుమార్, గల్లా తిమోతి, గడ్డంరాజు, మహమ్మద్ సమీర్, బొమ్మసాని నరేష్, వంపుగడల చౌదరి, జన్ను నాగరాజు, కొట్టే వెంకట్రావు, కర్రీ మహేష్, పినిశెట్టి వేణు, మోకా రవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డిల్లీరావు

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళిక ప్రకారం పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్ తదితరులతో కలిసి హాజరయ్యారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సీఈవో మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ డిల్లీరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. తుది ఓటర్ల జాబితా అనంతరం వివిధ ఫారాల పరిష్కారం, పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, భద్రతా సిబ్బందికి శిక్షణ, నియోజకవర్గాల వారీగా రూట్లు, అవసరమైన వాహనాలు తదితర అంశాలపై ఏర్పాట్లను తెలియజేశారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కమ్యూనికేషన్ ప్రణాళిక, సాంకేతిక వినియోగ ప్రణాళికల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డిల్లీరావు వెల్లడించారు.

ట్యాంకుల ద్వారా మంచినీటి సరఫరా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్‌లోని గణపతి రావు రోడ్డు, రాఘవరెడ్డి రోడ్డు వద్ద కాలవలో ఉన్న వాటర్ పైపులైను మార్పు చేసే పనిలో భాగంగా స్థానికులకు మంచినీరు ఇబ్బందులు లేకుండా స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు వాటర్ ట్యాంక్‌ల ద్వారా మంచినీరు సరఫరా చేయించే విధంగా చర్యలు చేపట్టారు. శనివారం జరుగుతున్న పైపులైన్ల పనుల నేపథ్యంలో మంచినీటి సరఫరాలో ఇబ్బందులను మహంతిపురం స్థానిక ప్రజలు కార్పొరేటర్ బోయి సత్యబాబు దష్టికి తీసుకురాగా వెంటనే ఆయా ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు తెలిపి మంచినీటి సరఫరాలో ఇబ్బందులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు.. పైపులైన్ల మరమ్మత్తుల పనుల్లో త్వరతగతిన పూర్తిచేసి ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిందిగా నగరపాలక సంస్థ కమిషనర్‌కి విజ్ఞప్తి చేశారు.

-ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న మంచినీరు సరఫరాను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

గిరిజన మహిళల రాస్తారోకో

(మొదటి పేజీ తరువాయి)

చిన్నా పెద్దా, ఆడ మగ తేడా లేకుండా ఎక్కువగా కాళ్ల చేతుల నొప్పులతోపాటు వివిధ రకాల వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గతంలో సిపిఎం, ప్రజా సంఘాలు నిర్వహించిన ఆందోళనలతో దిగివచ్చిన ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా మండలంలోని గ్రామాలకు కష్ణా జలాలను సరఫరా చేస్తోందన్నారు. అయితే 20 రోజులుగా కష్ణా జలాల సరఫరా జరగడంలేదన్నారు. కృష్ణా జలాలను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ల యజమానులకు ప్రభుత్వం నుండి బిల్లులు రావడం లేదని, అందువల్ల సరఫరా జరగడంలేదన్న విషయం తమ దష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలానే యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ పనులు పూర్తిచేసి ఏ కొండూరు మండలంలోని కిడ్నీ రోగులకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు మురళీకష్ణ, రాముడు, కోటి రామోజీలతోపాటు గిరిజన మహిళలు పాల్గొన్నారు.

సినీ జగత్తులో అజరామరం ఆ స్వరం

నేడు ఘంటసాల 50వ వర్ధంతి



సినీజగత్తులో అజరామరంగా నిలచిన అమరగాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు. ఆయన కష్ణా జిల్లా మోపిదేవి మండలం టేకుపల్లి గ్రామంలో అతి సామాన్య కుటుంబంలో జన్మించారు. గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, నటుడిగా మాత్రమే అందరికీ తెలుసు. కానీ ఆయనొక గొప్ప స్వాతంత్ర్య పోరాట యోధుడు. శ్రమదాత అన్న విషయం ఎవరికీ తెలియదు. టేకుపల్లి గ్రామంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో సూర్యనారాయణ రత్తమ్మ దంపతులకు 1922 డిసెంబరు 4న ఘంటసాల వెంకటేశ్వరరావు జన్మించారు. పదకొండేళ్ల వయస్సు వరకు టేకుపల్లిలోనే పెరిగారు. ఈ గ్రామానికి నాలుకు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదకళ్లేపల్లిలో ప్రముఖ సంగీత విద్వాంసుడు సుసర్ల దక్షిణామూర్తి శిష్యరికంలో సంగీత పాఠాలు నేర్చుకున్నారు.

ఉంగరం అమ్మేసి విజయనగరానికి

సంగీతం నేర్చుకునేందుకు ఘంటసాల ఇంట్లో చెప్పకుండా తన చేతికున్న బంగారం ఉంగరాన్ని అమ్మేసి విజయనగరం వెళ్లారు. అక్కడ పుర వీధుల్లో పాటలు పాడుతూ మధుకర వత్తిలో వారలు చేసుకుంటూ జోలిపట్టిన ఘంటసాల అకుటింత దీక్షతో ఎంతో శ్రమించి అమర గాయకుడిగా ఎదిగారు. ఓ అభినందన సభలో "ఏ తల్లి నా జోలిలో మొదటి కబళం వేసిందో అదే నాకు శ్రీరామరక్షగా వెన్నంటి నిలిచింది" అని చెప్పుకున్న ఘంటసాల వ్యక్తిత్వం అందరికీ ఆదర్శనీయమే.

18 నెలలు జైలులోనే

సంగీతంతోపాటు చిన్ననాటి నుంచే స్వాతంత్ర్య భావాలను జీర్ణించుకున్న ఘంటసాల ఆరోజుల్లో ఎన్నో స్వాతంత్ర్య ఉద్యమాలు, సభల్లో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ పిలుపు మేరకు తన 20వ ఏట క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలలు కారాగార శిక్ష అనుభవించారు.

పదివేలకు పైగా గీతాలాపన

తెలుగు, తమిళ, కన్నడ, మళయాళం, హిందీ, మరాఠీ భాషల్లో పదివేలకుపైగా గీతాలను ఆలపించిన ఘంటసాల దేశంలోనే గొప్ప గాయకుడిగా పేరొందారు. ఆయన ఏ భాషలో పాడినా తన వాడే అనే భావన ఆయా ప్రాంతవాసుల్లో ఉండేది. ఆయన స్వర పరచిన భగవద్గీత శ్లోకాలు పామరులను సైతం పరవశింపజేశాయి. గుండమ్మకథ చిత్రంలో 'కోలు కోలోయన్న కోలో నాసామి' అని పాడిన, 'శివశంకరీ శివానందలహరి' అని జగదేకవీరుడి కథలో శ్లాకించిన, 'చెయ్యెత్తి జేకొట్టు తెలుగోడా' అని దేశ భక్తిని చాటుకున్న ఆయనకు ఆయనే సాటి. 'బొమ్మను చేసి ప్రాణం పోసి- ఆ దేవునికిది వేడుక' అని దేవత చిత్రంలో విషాద గళంలో ఆ భగవంతున్ని నిలదీసిన ఘంటసాల 1974 ఫిబ్రవరి 11న తుదిశ్వాస విడిచారు. తన జన్మస్థలమైన ఘంటసాలో 1967 ఏప్రిల్ 21న 5 గంటలపాటు నిరంతరాయంగా గాన కచేరీ చేశారు. ఘంటసాల సంత మార్కెట్ వద్ద చేసిన ప్రదర్శనకు మెచ్చిన జనం చల్లపల్లి రాజా వారితో కలిసి ఆయనకు బంగారు గండి పెండారం తొడిగారు. అనంతరం అంబారీ (ఏనుగు) ఎక్కించి గ్రామంలో ఊరేగించారు. దేశంలోనే అతి పెద్ద 12 అడుగుల గానభంగిమ ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని జిఎస్‌ఆర్ ఫౌండేషన్‌కు చెందిన గాదె సాయిరాం సమకూర్చగా, ఘంటసాల గానకచేరీ చేసిన ప్రాంతంలోనే నెలకొల్పినారు.

జి.వెంకటేశ్వరరావు,
సమాచార శాఖ విశ్రాంత ఉద్యోగి.

పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. గ్రూప్ – 1, 2, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఈ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా యువ సివిల్ సర్వీసెస్ ఔత్సాహికులను ఉద్దేశించి హిమబిందు అధ్యక్షోపన్యాసం చేస్తూ డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ స్టడీ సర్కిల్‌లో చదివి ఉన్నతమైన ఉద్యోగాలు పొందిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు పాత ప్రశ్నాపత్రాలు కూడా చదివితే ఉపయోగం ఉంటుందన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎన్.రామమోహన్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్ బాబు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ (ఒకేషనల్ గైడెన్స్) యెర్రోజు సత్య బ్రహ్మం, మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాస్ వుడిగ, స్టడీ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకట నారాయణ రెడ్డి మాట్లాడారు.

స్టాక్ మార్కెట్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థినులు స్టాక్ మార్కెట్‌పై అవగాహన పెంచుకోవాలని స్టాక్ మార్కెట్ విశ్లేషకులు ఎం. సాంబశివరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో సెబీ సౌజన్యంతో 'మహిళలు – మార్కెట్ అవకాశాలు' అంశంపై సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మేనేజమెంట్‌బీ కామర్స్ విభాగంలో కోర్సులను అభ్యసించే విద్యార్థులు పెట్టుబడి రంగంలోని అవకాశాలను గమనించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, స్టడీ సెంటర్ కన్వీనర్ వీ శైలజ, కామర్స్ అండ్ మేనేజమెంట్ స్టడీస్ విభాగాధిపతి హేమంత్‌కుమార్, అధ్యాపకులు కల్మబేగం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం తుర్లపాడులో రూ.26 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సిసి రోడ్ల పనులకు శనివారం ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్‌రావు శంకుస్థాపన చేశారు. అలాగే చింతలపాడు గ్రామంలో ఎన్‌ఆర్‌యుఎం నిదులు రూ.40 లక్షల అంచనా వ్యయంతో స్టోరేజి గోడౌన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు వీలుగా స్టోరేజ్ గోడౌన్ లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.

వేరుశనగ పంట పరిశీలన

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని కన్నెవీడులో వేరుశనగ పంటను డాక్టర్ కే.ఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కృష్ణంరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన....జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల ద్వారా వేరుశనగలో అధిక దిగుబడినిచ్చే రకాలైన టిసిజిఎస్ 1694 (విశిష్ట) పునాది విత్తనాన్ని రైతులకు ఇచ్చారు. దీని దిగుబడిపై రైతుల క్షేత్రాలను సందర్శించారు. ఈరకం టీ.సీ.జీ.ఎస్– 1694 విశిష్ట 25 క్వింటాలు ఖరీఫ్ పంట కాలంలో, 25 నుంచి 30 క్వింటాలు రబీ పంట కాలంలో దిగుబడిని ఇస్తుంది. రకం పంట కాలం పంట కాలం 105 నుండి 110 రోజులు, గింజ శాతం 72 నుంచి 75 వరకు ఉంటుంది. నూనె 50 శాతం ఉంటుంది. లేత, ముదురు ఆకుపచ్చ తెగులు తట్టుకుంటుంది. గింజ గులాబీ రంగులో ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో రైతులు, శాస్త్రవేత్త డాక్టర్ ఐ.వెంకటరెడ్డి (వ్యవసాయ విస్తరణ విభాగం) పాల్గొన్నారు.

నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలోని శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో శనివారం శ్రీ రాజ్య శ్యామలా గుప్తా నవరాత్రి మహోత్సవాలను ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలు ఈనెల 18వ తేదీ వరకు జరగనున్నాయని శక్తి పీఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ కరుమారి దాసు (కరుణ స్వామి) తెలిపారు. తొలిరోజు శ్రీ దేవీ కరుమారి అమ్మన్ అమ్మవారు లఘుశ్యామలాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. హోమంలో చలువాది ప్రకాష్ శైలజ, వెంకట దుర్గారావు, లక్ష్మీ దేవి, సత్యనారాయణ, హేమలత, అవుతుపల్లి చిట్టిబాబు నాగ మల్లీశ్వరి దంపతులు పాల్గొన్నారు.

తిరుమలగిరి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం చింతకాని మండలం చింతకాని వాస్తవ్యులు పోలూరి కార్తీక్, మాధవి దంపతులు రూ.25,116 లు విరాళం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం బుద్ధారం వాస్తవ్యులు కొండపల్లి వెంకట్రామ నరసింహారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు కెఎల్.ఎన్.శర్మ 10,116 అందజేశారు. శ్రీ స్వామివారి నిత్యాలంకరణ నిమిత్తం, నిత్య కైంకర్యం శ్రీ స్వామివారికి సూర్యాపేట వాస్తవ్యులు బాధవత్ వేదసాహితి 360 గ్రాములు వెండి పళ్లెము, పంచపాత్ర సమర్పించారు. దాతలకు శ్రీ స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, ధర్మకర్త దర్శి వెంకటేశ్వర్లు అందజేసినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వాహనాధికారి డి.శ్రీరామ వర ప్రసాదరావు తెలిపారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి ఆటంకం : కౌన్సిలర్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని తొర్రగుంటపాలెంలో గల సర్వేనెంబర్ 30లోని 5.68 ఎకరాల ప్రభుత్వ భూమిలో పేదల ఇళ్ల స్థలాల పంపిణీని కావాలనే కొందరు అడ్డుకుంటున్నారని 8వ వార్డ్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొర్రగుంటపాలెంలోని 170 మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయన్నారు. అయితే కొందరు వ్యక్తులు ఇళ్ల పట్టాలను అడ్డుకునేందుకు కోర్టుల ద్వారా స్టేలు తీసుకువచ్చి అడ్డుకుంటున్నారన్నారు. అయినా కొద్ది రోజుల్లో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు.

చైతన్య పాఠశాలలో 'అమ్మకు వందనం'

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రైతు పేట చైతన్య పాఠశాలలో ఆరు నుండి పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య అమ్మకు వందనం వేడుక నిర్వహించారు. స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా మానవతా విలువలు అంతరించిపోతున్న ఈ రోజులలో అమ్మ నాన్న ఒక గొప్పతనాన్ని విద్యార్థులతో తల్లిదండ్రులకు గుర్తుండిపోయేలా జరిగిన ఈ కార్యక్రమం ఎందరినో అలరించింది. విద్యార్థుల ప్రేమ వారి తల్లిదండ్రుల మీద ఎంత అమోఘంగా ఉంటుందని కార్యక్రమం నిరూపించిందని పాఠశాల ప్రిన్సిపల్ గుత్తా ప్రదీప్ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. ఏజీ మురళీకష్ణ , ఆర్ఐ వినోద్ చైతన్య స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు

పెనుమల్లి పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న షెడ్డు

ప్రజాశక్తి-పెడన: దేశానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేసినప్పటికీ వాటిని సద్వినియోగం పరుచుకోవడంలో నాయకులు, కింది స్థాయి అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో చెత్త సంపద తయారీ కేంద్రాలు ఈ షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వీటిని సద్వినియోగంపరిచి నలుగురికి ఉపాధి చూపించాల్సిన పంచాయతీలలోని సర్పంచులు, కార్యదర్శులు అసలు పట్టించుకున్న దాఖలాల లేవని ఆరోపణలు వస్తున్నాయి. వివరాల్లోకెళ్తే నియోజకవర్గ పరిధిలో గూడూరు, పెడన, బంటుమిల్లి, కత్తివెన్ను ఈ నాలుగు మండలాలు ఉండగా వీటికి అనుసంధానంగా 82 పంచాయతీలు ఉన్నాయి. వీటన్నిటికీ ఆయా పంచాయతీలలోని జనాభాను బట్టి మూడు నుంచి నాలుగు లక్షల చొప్పున కేంద్ర ప్రభుత్వం గత నాలుగేళ్ల క్రితమే (ఎన్ఆర్ఈజీఎస్) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి 3.10 కోట్లకు పైగా నిధులను వెచ్చించింది. దీంతో ఆయా మండలాధికారులు త్వరితగతిన ఆయా గ్రామాల్లో పర్యటించి పంచాయతీ సర్పంచ్ల వద్ద నుంచి చెత్త నుంచి సంపాద తయారీ కేంద్రాలను తయారు చేసేందుకు ప్రణాళిక రూపొందించి, అంచనాలు తయారు చేశారు. అంతేకాకుండా ఈ షెడ్లను ఆరు నెలల నిర్ణీత కాల వ్యవధిలోనే పూర్తిచేసి ఆయా పంచాయతీలకు అప్పగించేశారు. వీటితో ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్మిక సిబ్బంది గ్రామాల్లోని

తిరుమలలో తాగి పారేసిన మద్యం సీసాలు

తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి ఈ షెడ్లలో నిల్వ ఉంచి ఈ చెత్తను పలు రకాల పదార్థాలు కలిపి మిశ్రమంగా తయారు చేస్తారు. వీటిని రైతులకు ఉత్పత్తి చేస్తారు. దీనివలన పంచాయతీలకు ఆదాయం అలాగే అతి తక్కువ ధరకే వ్యవసాయ రైతులకు ఈ చెత్తను అమ్మకాలు జరపాలి అన్నది ఈ పథకం యొక్క ఉద్దేశం. ఇందుకు పంచాయతీ సర్పంచ్‌తో పాటు క్లాత్ మిత్రలకు కూడా దీనిలో భాగస్వాములే. అంతేకాకుండా గ్రామాల్లోని ఉపాధి లేని వారికి ఉపాధి కూడా దొరుకుతుందని కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకం చేపట్టింది. నియోజవర్గంలో ఏర్పాటు చేసిన 82 షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని వీటిని ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

విద్యుద్ఘాతంతో టిప్పర్ లారీ దగ్ధం

డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-మైలవరం: ప్రమాదవశాత్తు కరెంటు వైర్లు తాగటంతో టిప్పర్ దగ్ధమైంది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం త్వరలో రానున్న శివరాత్రుని పురస్కరించుకొని వెల్వడం గ్రామం ఊరు చివరలో ఉన్న

బాల కోటేశ్వర స్వామి ఆలయం వరకు తారు రోడ్డు వేసే నిమిత్తం టిప్పర్లలో కంకర తోలుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి కొండపల్లి నుండి కంకర లోడుతో ఉన్న టిప్పర్ వెల్వడం తోలుకోడ్ రోడ్డు నుండి బాల కోటేశ్వర స్వామి ఆలయం వరకు వెళుతుండగా మార్గమధ్యంలో కరెంటు వైర్లు టిప్పర్ కు తాగటంతో మంటలు చెలరేగాయి. మంటలు ఉధృతం అవటంతో మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ నరసింహ సంఘటన స్థలంలోని మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న మైలవరం పోలీసులు మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మైలవరం అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు

సరుకుల సరఫరా నిల్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: బియ్యం, కందిపప్పు, నూనెలు అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా కాకపోవడంతో పిల్లలకు ఆహారం అందించేందుకు కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మండలంలోని 60 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన అంగన్వాడి కేంద్రాలకు రావల్సిన గర్భవతులకు,

బాలింతలకు కిట్లు వచ్చాయని ప్రీ స్కూల్ పిల్లలకు రావాల్సిన రైస్, కందిపప్పు, నూనె లు పదవ తేదీ వచ్చిన అందలేదని అంగన్వాడీ కార్యకర్తలు చెప్తున్నారు. రేషన్ సరుకు తీసుకొచ్చే రేషన్ వ్యాన్ డ్రైవర్ నీ అడగగా రేషన్ డీలర్ తంబు వేయలేదని అందువల్ల సరుకులు రాలేదని చెబుతున్నారని తెలిపారు. వెంటనే తమ కేంద్రాలకు నిత్యవసర సరుకులు అందించాలని కార్యకర్తలు కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గను వివరణ కోరగా అన్ని కేంద్రాలకు సరుకులు అందజేశామని అందకపోతే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పివి, ఎంఎస్‌లకు

భారతరత్న పట్ల హర్షం

ప్రజాశక్తి-గన్నవరం: మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌లకు భారతరత్న ప్రకటించడం హర్షణీయమని గన్నవరం మాజీ ఎమ్మెల్యే ముసునూరు రత్న బోస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పీవీ నరసింహారావ ప్రధానిగా దేశానికి అందించిన సేవలు మరువలేనివి అని పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథం వైపు పరుగులు పెట్టించారన్నారు. అలాగే ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. . తన పరిశోధనలతో నూతన వంగడాలు సృష్టించడంతో భారతదేశ వ్యవసాయ ముఖ చిత్రమే మారిపోయిందని చెప్పారు.

ఉయ్యూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-ఉయ్యూరు: జగన్మోహన్రెడ్డి నాలుగున్నరేళ్లుగా చేసిన అరాచక ఆటవిక పాలనపై నారాలోకేశ్ పూరించిన సింహనాధమే శంఖారావమని మాజీ ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. బాబు షూర్యిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉయ్యూరు ఒకటవ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వైసీపీ పాలనపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువగళమే జనగళమై సాగిన నారాలోకేశ్ పాదయాత్ర చ రిత్రలో నిలిచిపోతుందన్నారు. యువత భవిత కోసం గళం వినిపించి భావి తరాలకు బాసటగా రానున్న తరాల నాయకుడుగా ఎదిగిన నారాలోకేశ్ చారిత్రాత్మక పాదయాత్ర నిర్వహించారని కొనియాడారు. కుప్పంనుంచి మొదలైన మహా పాదయాత్ర అంచలం చెలుగా, అవరోధాలను అధికమించి సాగిందని, నిరుద్యోగులకు బాసటగా, నిత్యావసర ధరలతో నరకయాతన అనుభవిస్తున్న ప్రజల ఆర్తనాధాలు వింటూ వారికి ధైర్యం చెప్పిన నాయకునిగా నిలిచారన్నారు. పాదయాత్రలో పర్యటించని నియోజకవర్గాలకు శ ఖారవం నినాదంతో జగన్ దౌర్జన్యాలు

లోకేశ్ తెలియజేయనున్నారని పేర్కొన్నారు. 40 రోజులపాటు 120 నియోజకవర్గాల్లో పాదయాత్రచేసి ప్రజల కష్టాలు తెలుసుకుం టూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు వివరిస్తూ భరోసా ఇస్తారని తెలి పారు. వైసీపీ నేతల బరితం పట్టటానికి యువకెరటం వస్తుందన్నారు. పట్టణ, మం డల పార్టీ నాయకులు, తెలుగు మహిళలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: సమాజ శ్రేయస్సుకై విరాళాలు అందిస్తున్న పారిశ్రామికవేత్త పుట్టగుంట దాతత్వం అభినందనీయమని లయన్స్ ప్రతినిధులు కొనియాడారు. బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్లోని లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్ ఆధునీకరణ నిమిత్తం ప్రముఖ పారిశ్రామికవేత్ పుట్టగుంట సతీష్‌కుమార్ శనివారం రెండు లక్షల రూపాయలు విరాళంగా అందజేశారు. క్లబ్ లోనే హెల్త్ క్లబ్ ఏర్పాటు చేసిన పుట్టగుంట యువతకు అధునాతన పరికరాలతో జిమ్‌ని ఏర్పాటు చేశారు. గతంలోనూ రెండు లక్షల రూపాయలు క్లబ్ అభివృద్ధికి విరాళమిచ్చారు. తోటివారికి నిస్వార్థంగా సేవలు అందిస్తూ ఆపద సమయంలో వారికి అండగా నిలబడుతున్న పుట్టగుంట సతీష్‌కుమార్ ఆదర్శనీయుడని సేవా తత్పరతకు లయన్స్ ప్రతినిధులు నందిగం స్వామి, గూడపాటి రత్నశేఖర్, అట్లూరి శ్రీను, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహ నిర్మాణ పనులపై హైకోర్టు స్టే

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: అధికారం మాదే.. అడ్డుకునేది ఎవరంటూ..కొందరు అధికార పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బాపులపాడు మండలం వేలేరు గ్రామంలో స్థానిక నాయకుల ప్రోద్బలంతో రేమల్లె, సింగన్నగూడెం, మల్లవల్లి వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి కూడలిలో కనీస అనుమతులు కూడా లేకుండా మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అసలే గుంటలతో నిండిన రహదారి బాగు చేయకపోగా ఉన్న రహదారికి అడ్డుగా మధ్యలో 3అడుగుల వెడల్పుతో భారీ గొయ్యితవ్వడంతో పాటు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఇనుప మెష్లు బిగించేస్తున్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా వైసీపీ నాయకులు దగ్గరుండి విగ్రహం ఏర్పాటుల పనులను పర్యవేక్షిస్తున్నారు.గ్రామానికి వచ్చే ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు గోతులతో నిండిఉన్నా మరమ్మత్తులు కూడా చేయడం చేతగాని నాయకులు విగ్రహం కోసం బాగున్న రహదారిని

వైఎస్ విగ్రహం ఏర్పాటుకు జరుగుతున్న పనులు

తవ్వేయడంపై స్థానిక ప్రజలతో పాటు ప్రయాణీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగంగా ఇంత జరుగుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు గానీ, పంచాయితీ, రెవిన్యూ అధికారులుగానీ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదంటే అధికార పార్టీ నాయకుల పలుకుబడి ఎంత బాగా పనిచేస్తుందో అర్థమౌతోంది.ఎక్కడైనా విగ్రహం ఏర్పాటు చేయాలంటే పంచాయితీ తీర్మానంతో పాటు వివిధ శాఖలు అనుమతులు తీసుకుని కలెక్టరకు నివేదించాలి.కానీ వేలేరులో మాత్రం విగ్రహ ఏర్పాటుకు ఎటువంటి అనుమతులు లేకుండా విగ్రహాన్ని ఏర్పాటుపై రాజకీయం ఎంత యథేచ్ఛగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.రోడ్డును ధ్వంసం చేస్తూ, ప్రయాణీకులకు ఇబ్బంది కలిగేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రజారవాణాకు ఆటకం వాటిల్లేలా వేలేరు ఆర్అండ్‌బీ వద్ద నిర్మిస్తున్న విగ్రహ నిర్మాణపనులపై హైకోర్టు శనివారం స్టే ఉత్తర్వులను జారీ చేసింది. వేలేరు రోడ్డు కూడలిలో అనధికారికంగా నిర్మిస్తున్న వైఎస్సార్ విగ్రహ నిర్మాణ పనులను తక్షణం నిలుపదల చేయాలని, ఉత్తర్వులను ఎవరైనా మీరితే కంటెమ్ట్ ఆఫ్ కోర్టుగా కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉత్తర్వుల్లో తెలిపారు. ఇకపై ఎటువంటి నిర్మాణ పనులు జరుగకుండా ఆర్ అండ్ బీ సూపరిం డింట్ ఇంజనీర్, తహసీల్దార్, వేలేరు గ్రామ పంచాయితీ తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈత పోటీలకు పేట నుండి స్విమ్మర్లు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ నెల 12,13, తేదీలలో గోవా. ఫటోర్దా, మార్గో స్విమ్మింగ్ పూల్ కాంప్లెక్స్‌లో మాస్టర్స్ గేమ్స్ వారు నిర్వహించే 6వ జాతీయ ఈత పోటీల్లో జగ్గయ్యపేట నుండి ఆరుగురు మహిళలు, ఐదుగురు పురుషులు మొత్తం 11 మందితో కూడిన జట్టు ఐఎం, ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్‌ఫ్లై, 400, 200, 100, 50 మీటర్ల విభాగాలలో పోటీ పడనున్నారు. ఈ పోటీలలో పాల్గొనే స్విమ్మర్స్‌కు స్థానిక స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ దంపతులు పొట్లూబత్తిన పాండురంగారావు- లక్ష్మీ కఠిన శిక్షణ ఇచ్చారు. పోటీల్లో పాల్గొనేందుకు శనివారం స్విమ్మర్లు బయలుదేరి వెళ్లినట్లు డిఎస్ఎ అధ్యక్షులు మందాడపు శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ అన్నం నీడి కళ్యాణ్ తెలిపారు.

పిల్లలకు కుటుంబ విలువలు నేర్పాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే చిన్నారులకు కుటుంబ విలువలు, సంస్కృతి సంప్రదాయం, పెద్దలను గౌరవించడం వంటి అంశాల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని కరెన్సీ నగర్ శ్రీ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. 'ఫ్యామిలీ ఫెస్ట్' పేరుతో శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. వందల సంవత్సరాలుగా భారతీయ సంస్కృతిలో భాగమైన ఎన్నో అంశాలు ఈ తరం పిల్లలకు పూర్తిస్థాయిలో తెలియజేపోవడం వల్ల భవిష్యత్తులో వీరు పలు సమస్యలు ఎదుర్కొంటారన్నారు. తల్లిదండ్రులను గౌరవించడం, బాధ్యతాయుతంగా మాట్లాడటం, సమాజంలో ఇతర వ్యక్తులు పట్ల ప్రవర్తించాల్సిన తీరు వంటి అంశాలు నేటి తరం పిల్లలకు తెలియజెప్పడమే ముఖ్యోద్దేశంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. తల్లిదండ్రుల కాళ్లను సంప్రదాయబద్ధంగా కడిగారు. ఈజిఎం మురళీకృష్ణ, ఆర్ ఐ నరేంద్ర లతో సహ ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బ్యాంకు రీజనల్ హెడ్ ఎం.ఎస్.ప్రసాద్ తెలిపారు. నగరంలోని బ్యాంకు ఆవరణలో అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు డిజిటల్ బ్యాంకింగ్ అవగాహనా డ్రైవ్‌లో భాగంగా సురక్షితమైన డిజిటల్ బ్యాంకింగ్ పద్ధతులపై శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా యువతరానికి అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానంతో సన్నద్ధం చేయడానికి బ్యాంకింగ్ వర్క్‌షాపులను విజయవాడతో పాటు గుంటూరులో కళాశాలలు, పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

ఇక నీటికి ఇబ్బందులుండవు : మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని పంప్ హౌస్‌ను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ కొన్ని రోజులుగా కొన్ని ఏరియాలలో మంచినీటి సరఫరా అందజేయడం లేదని, పంప్ హౌజ్ వద్ద మెయిన్ పైప్ లైన్ లీకేజ్ వల్ల ప్రజలకు మంచినీటి టాంకర్ల ద్వారా నీరు అందజేసినట్లు పూర్తి స్థాయిలో అందజేయడానికి తమ వంతు కృషి చేసినట్లు తెలిపారు. ఇక నీటి సరఫరాకు ఇబ్బందులుండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, కౌన్సిలర్ వట్టెం మనోహర్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న చైర్మన్

ఎన్నికల తాయిలాలు

ఇంకా ఎన్నికల షెడ్యూల్ రాకముందే రాజకీయ నేతలు ప్రజలను, ప్రభుత్వ ఉద్యోగులను ప్రలోభాలకు గురిచేయడం ప్రారంభమైంది. వారికి తాయిలాలు ఇవ్వడం, ప్రకటించడం వంటి జిత్తులమారి ఎత్తులకు నేతలు శ్రీకారం చుడుతున్నారు. క్షేత్రస్థాయిలో డబ్బులు, బహుమతులు పంపిణీకి సన్నాహాలు చేసుకుంటున్నారు. అనేక రూపాల్లో ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల కాలంలో వివిధ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఎటువంటి ఆధార పత్రాలు లేకుండా తరలిస్తున్న కోట్లాది రూపాయలను స్వాధీనం చేసుకోవడమే ఇందుకు ఉదాహరణలుగా ఉన్నాయి. పోలీసులు పెట్టిన నిఘాలో అరకొరగానే డబ్బులు స్వాధీనం చేసుకోగలుగుతున్నారు. వందల కోట్లు ఇప్పటికే క్షేత్రస్థాయి ప్రవాహంలా వెళుతున్నాయి. గత రెండు వారాల్లో నిర్వహించిన తనిఖీల్లో సరైన ఆధార పత్రాల్లేకుండా తరలిస్తున్న కోటి 36 లక్షలకుపైగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులే అధికారికంగా ప్రకటించారు. ఒక్క కృష్ణాజిల్లాలోనే నాలుగు చెక్‌పోస్టుల వద్ద అక్రమంగా తరలిస్తున్న నగదును గుర్తించి స్వాధీనం

వీక్షణం

చేసుకున్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద రెండు రోజుల్లో సుమారు రూ.62.44 లక్షల నగదును పట్టుకున్నారు. ఒకరోజు కారులో తరలిస్తున్న రూ.9.94 లక్షలను, మరుసటి రోజు రూ.52.50 లక్షలను, రెండు కార్లను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే గుడివాడ రూరల్ మండలం ముదినేపల్లి రోడ్డులోని చౌటుపల్లి వద్ద రూ.61 లక్షల నగదును పట్టుకుని ఓ వ్యక్తిని, కారును స్వాధీనం చేసుకున్నారు. తోట్లవల్లూరు మండలం యాకమూరు పోలీస్ చెక్‌పోస్టు వద్ద కారులో రూ.9 లక్షల నగదును, ఉంగుటూరు మండలం పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద కారులో తరలిస్తున్న రూ.4.10 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇది కేవలం పోలీసుల గుర్తించిన నగదు మాత్రమే. ఇంకా వారి కన్నుగప్పి ఇంకెన్ని కోట్లు తరలుతున్నాయో అంచనా వేయొచ్చు. ఇక విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎంఎల్ఎ, వైసిపి సమన్వయకర్త అయితే వెలంపల్లి శ్రీనివాసరావు వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి కుక్కర్లు పంపిణీ చేశారని వచ్చిన వార్తలు కలకలం రేపాయి. ఈ నేపథ్యంలోనే ప్రజలపై నమ్మకం లేకే అధికార పార్టీ నేతలు ప్రజలను, చిరుద్యోగులను ప్రలోభాలకు గురిచేస్తున్నారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. కుక్కర్లను, బహుమతులతో వాలంటీర్ల ద్వారా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపిస్తున్నాయి. ఇలా డబ్బులు, బహుమతులతో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం క్షంతవ్యంకాదు. ఇటువంటి వారికి ప్రజలే తగిన రీతిలో బుద్ధిచెబుతారు.

- ఎం.బి.నాథన్

నగరంలో 'భామాకలాపం-2' బృందం సందడి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఫిబ్రవరి 16న భామాకలాపం 2 చిత్రం విడుదల కానున్నట్లు ప్రముఖ కథా నాయకురాలు ప్రియమణి తెలిపారు. క్రైమ్, థ్రిల్లర్ సస్పెన్స్ ,కామెడీ అన్ని అంశాలతో చిత్రం మీ ముందుకు రాబోతుంది అని చెప్పారు.చిత్రం ప్రేక్షకులను ఎంతగానో ఆకర్షిస్తుందని,చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. హీరోయిన్ ప్రియమణి, సిరత్, శరణ్య కాంబినేషన్లో వచ్చిన భామాకలాపం 2 చిత్రం ప్రమోషన్‌లో భాగంగా విజయవాడలో ఆ చిత్ర బందం సందడి చేసింది. ఈ సందర్భంగా చిత్ర హీరోయిన్ ప్రియమణి మీడియాతో మాట్లాడారు. భామాకలాపం వన్ పెద్ద సక్సెస్ అయ్యింది, భామ కలపం టు కూడా సక్సెస్ చేయాలని ప్రేక్షకుల్ని కోరుకుంటున్నానని చెప్పారు. క్రైమ్, థ్రిల్లర్ సస్పెన్స్, కామెడీ అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయని చెప్పారు. ఓటీటీలకే విశేష స్పందన రావడంతో ఆహా కి ఓకే చెప్పామనీ అన్నారు. తనకు పూర్తిగా విలన్ రోల్ చేయాలన్న కోరిక ఉందనీ... ఆ పాత్ర కోసం ఎదురు చూస్తున్నాననీ చెప్పారు. నరసింహ చిత్రంలో రమ్యకృష్ణ చేసిన పాత్ర అంటే తనకు ఎంతో ఇష్టం అని, హీరోతో సమానంగా ఉండే విలన్ పాత్రని పోషించాలి అనుకుంటున్నానని చెప్పారు. హిందీలో నటించిన ఆర్టికల్ 370 చిత్రం త్వరలో విడుదల కానుందనీ, అజయ్ దేవగన్‌తో నటించిన మైదాన్ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉందనీ చెప్పారు. అనంతరం హీరోయిన్ సిరత్ మాట్లాడుతూ భామాకలాపం 2 లో నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందులో తన పాత్ర చాలా విభిన్నమైనదనీ,థ్రిల్లర్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయనీ చెప్పారు.హీరో నితిన్ తో కొత్త మూవీలో కనిపించనున్నట్లు చెప్పారు. నటి శరణ్య మాట్లాడుతూ భామాకలాపం1లో పని మనిషిగా తన పాత్ర ఎంతగానో ప్రేక్షకుల్ని ఆకట్టుకుందనీ, ఈ చిత్రంలో కూడా తన పాత్ర ప్రేక్షకుల్ని ఆకర్షిస్తుందనీ పేర్కొన్నారు. ఈ చిత్రంలో ప్రియమణి చెల్లిగా తను నటిస్తున్నాను అని... అక్క చెల్లెలుగా మేమిద్దరం నటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇందులో చాలా సీనియర్ నటులు యాక్ట్ చేస్తున్నారని చెప్పారు.

మాట్లాడుతున్న ప్రియమణి

మార్కాపురం డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా చేయాలి

- డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : మార్కాపురం డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటుచేసేందుకు కృషి చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరిని కోరినట్లు ఎస్.ఆర్.సి. లాబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా పార్టీ అధ్యక్షురాలిని కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రకాశం జిల్లాలోని పలు సమస్యలను తెలియచేసినట్లు తెలిపారు. మార్కాపురంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల గురించి ఆమెకు వివరించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వెలుకొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో ఈప్రాంత ప్రజలు రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు.

కమిషనర్ జయరాంకు సత్కారం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో శ్రీకరం ఫంక్షన్ హాల్‌లో నందిగామ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న యస్.జయరాం వీడ్కోలు సభ, నూతన కమిషనర్‌గా నియమితులైన కె.హేమమాలిని ఆహ్వాన సన్మాన సభ శుక్రవారం రాత్రి ఏర్పాటు చేశారు. ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు, ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఉద్యోగులంతా కలిసి కట్టుగా.. పట్టుదల, నిబద్ధతతో పనిచేస్తే అద్భుత ఫలితాలు వస్తాయి అనడానికి నందిగామ పురపాలక సంఘమే ఉదాహరణ అని చెప్పారు. నూతనంగా వచ్చిన కమిషనర్ కె. హేమమాలిని కూడా అదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ జయరాం మాట్లాడుతూ వత్తి పట్ల విశ్వాసం, నిబద్ధతతో పనిచేసే ప్రతి ఉద్యోగి గుర్తింపు, గౌరవం తప్పక లభిస్తుందన్నారు. పని చేసే ప్రతి చోట కొన్ని అడ్డంకులు ఎదురవుతా యని, అయినప్పటికీ ఆత్మవిశ్వాసంతో ముం దుకు వెళితే మంచి జరుగుతుందని తెలిపారు. జయరామ్‌ను శాలువాతో సత్కరించి, మెమొంటోలు అందజేశారు.

ఆకట్టుకుంటున్న లిటిల్ బ్రైన్స్ సైన్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులు సృజనాత్మకశక్తిని పెంపొందించుకుని, ఆల్ రౌండర్ నైపుణ్యం పెంపొందించుకోవాలని, ప్రతి విద్యార్థిలోనూ అద్భుతమైన సృజనాత్మకత దాగి ఉంటుందని లిటిల్ బ్రైన్స్ స్కూల్ డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్కేవి అన్నారు. సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రైన్స్ స్కూల్‌లో 'సైన్స్ ఎక్స్ పో - 2024' ప్రదర్శన శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టు నేర్చుకోవడంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జి పెంపొందించేందుకు సైన్సు ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఎంతోమంది విద్యార్థులకు సృజనాత్మక శక్తులు ఉంటాయని వాటిని వెలికితీసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. లిటిల్ బ్రైన్స్‌స్కూల్ విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాలపై ఆసక్తి కలిగించి ఆల్‌రౌండర్లుగా తయారుచేయడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులకు ప్రశ్నించేతత్వం. ఎందుకు .. ఏమిటి.. ఎలా అని ఆలోచించినప్పుడు వారి సమాధానాలకు జవాబు దొరుకుతుందని ఆ విధంగా చేయడంలోనే తాము కృషి చేస్తున్నామని తెలిపారు. స్కూల్‌కు సంబంధించి నర్సరీ నుండి 9వ తరగతి విద్యార్థులు వారి సబ్జెక్టుకు సంబంధించిన పలు అంశాలు చక్కగా రూపొందించి ప్రదర్శనగా ఏర్పాటుచేశారని తెలిపారు. సుమారు 70 ప్రదర్శనలు విద్యార్థులు స్వయంగా చేసి ప్రదర్శనగా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్భుత సృష్టి .. : విద్యార్థుల్లో దాగియున్న సృజనాత్మకతను వెలికితీసేలా ఏర్పాటుచేసిన సైన్సు ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా హైడ్రో పవర్ ప్లాంట్, పోలవరం డ్యామ్, చంద్రయాన్ -3, సోలార్ అగ్రికల్చర్, లిక్విడ్ ట్రీ, జియో శాటిలైట్ విధానం, ఫైర్ అలారం వంటి అంశాలను విద్యార్థులు చక్కగా థర్మాకోల్ షీట్లతో తయారుచేసి సందర్శకులకు వచ్చిన వారికి చక్కగా వివరిస్తున్నారు. అంతకంటే ముఖ్యంగా మనం తీసుకోవాల్సిన ఆహారం ఏవిధంగా ఉపయోగపడుతుందని ఎటువంటి ఆహారం తీసుకుంటే శరీరానికి మంచిది, ఎటువంటి విటమిన్లు ఇస్తాయనేది కూడా చక్కగా చేసి చూపించారు. మానవ శరీరంలోని వివిధ దశలు, రక్త గ్రూపు పరీక్షలను విద్యార్థులు స్వయంగా చేసి చూపడం సందర్శకులను ఆకట్టుకుంటుంది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు వీలర్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.